


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 331, పేజీలు - 08
గురువారం, మే 21, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్‌సిటీకి తీసుకురావాలి

### - ఫ్యూచర్ సిటీలో నెట్ జీరో సిటీ తరహాలోనే డిజైన్స్ ఉండాలి

- హెల్త్ క్లస్టర్ ఫ్యూచర్ సిటీ వచ్చేలా చర్యలు
- ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్న సీఎం రేవంత్- 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని సూచన





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 'నెట్ జీరో సిటీ తరహాలోనే డిజైన్స్ ఉండాలి. మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి ఇందులో రాజీ పడొద్దు' అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలి. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలి. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలి. ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు,సివిల్ సర్వీస్ అధికారులు,జర్నలిస్ట్ లకు 500 ఎకరాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో పరిశ్రమల శాఖ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ను ఫ్యూచర్ సిటీ వచ్చేలా చర్య లు తీసుకోవాలి. అవసరం అయితే ప్రధాని మోడీని కలిసి హెల్త్ క్లస్టర్

2లో..

## కులగణనకు లైన్ క్లియర్

### - సుప్రీంకోర్టు సంచలన తీర్పు

- కులగణనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టేసిన ధర్మాసనం
- ప్రభుత్వానికి ఆ వివరాలు తెలియాలని స్పష్టం
- పథకాల అమలుకు కులగణన ఉపయోగపడుతుందని వ్యాఖ్య



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రాబోయే జాతీయ జనాభా గణనలో 'కులాల వారీగా డేటా సేకరణ'ను మినహాయించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు బుధవారం నాడు నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. రాబోయే 2027 జనగణనలో కుల గణనను చేర్చడాన్ని సవాలు చేస్తూ సుధాకర్ గుమ్ముల అనే వ్యక్తి వ్యక్తిగతంగా దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం

2లో..

## ఎక్కడైనా కొడుకును తండ్రి పోలీసులకు అప్పగిస్తాడా..?

### - బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

- కొత్త పార్టీ వార్తలను ఖండించిన బండి సంజయ్
- విచారణ కోసం కొడుకును అప్పగించినట్లు వెల్లడి
- బీఆర్ఎస్ ఫేక్ మీడియా ఫ్యాక్టరీని నడుపుతుందని మండిపాటు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కొత్త పార్టీ పెట్టబోతున్నారంటూ, కేంద్ర క్యాబినెట్ నుండి బర్తరఫ్ చేయబోతున్నారంటూ వస్తున్న వార్తలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. కన్న కొడుకును ఒక తండ్రి నేరుగా పోలీసులకు అప్పగించిన సందర్భం ఒక్కటైనా ఉందా ఆరోపణలు రావడంతో నిజాయితీగా నేను బండి భగీరథ్‌ను పోలీసులకు అప్పగించాను అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బుధవారం వచ్చిన బండి సంజయ్‌కు కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సీనియర్ నేతలు డాక్టర్ మనోహర్ రెడ్డి, ఎన్వీ సుభాష్‌లతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు పనిగట్టుకుని తనపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

**ఫాల్తుగాళ్లు చేసే ప్రచారాన్ని పట్టించుకోను..**

తాను కొత్త పార్టీ

2లో..

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఏపీలో పనిచేయాలి

- ఫౌండేషన్ 45 వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు



**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పని చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీ రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవంతో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45వ వార్షికోత్సవంలో పాల్గొనటం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. కేవలం ఓ ముఖ్యమంత్రిగానే ఇక్కడికి రాలేదని, ఓ భారతీయుడిగా, గురూజీ బోధనల్ని అనుసరిస్తున్న వ్యక్తిగా ఇక్కడికి వచ్చానని పేర్కొన్నారు. ఆయన కేవలం ఓ ఆధ్యాత్మికతను బోధించే ఓ గురువు మాత్రమే కాదని, శాంతిసామరస్యాలను చాటిచెప్పే ప్రపంచ మానవుడని కొనియాడారు. ప్రాచీన భారతీయ విజ్ఞానానికి

2లో..

## ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించండి

### - దేశానికే ఆదర్శంగా ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ ఉండాలన్న లోకేశ్






అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా అధికారులు కృషిచేయాలి, ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సచివాలయంలో డీఈవోలు, ఏపీసీలతో మంత్రి సమీక్షించారు. కాకినాడ జిల్లాలో అప్పర్ ప్రైమరీ స్కూల్స్ లో స్టూడెంట్, టీచర్ యావరేజ్ అటెండెన్స్ తక్కువగా ఉంది. దీనిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. బేసిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, పదో తరగతి పరీక్షా ఫలితాలు, మధ్యాహ్న భోజనం వినియోగంలో జిల్లా వెనుకబడి ఉందన్నారు. అపార్ ఐడీ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచారని మంత్రి ప్రశంసించారు. కాకినాడ డీఈవో పి.రమేష్ స్పందిస్తూ,

2లో..

## విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ఆర్బీఎం మినహాయింపు ఇవ్వండి

### - నిర్మలా సీతారామన్ తో భట్టి మల్లు భేటీ

- రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రితో భట్టి చర్చ
- ఎస్ఏఎస్సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి
- యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరణ



న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో మౌలిక వసతుల కల్పన, విద్యా రంగాల బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, విద్యా మౌలిక వసతుల పెంపుదల, వివిధ రంగాల్లో చేపట్టాల్సిన మూలధన

2లో..

## మధ్యాన్నం వేళ ప్రయాణాలు మానుకోండి

### - ఎండల దృష్ట్యా ప్రజలకు సీఎం సూచన

- తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండలు
- అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్న సీఎం
- వడదెబ్బకు గురైన వారికి తక్షణ వైద్యం అందించేలా చర్యలకు ఆదేశం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో భానుడు భగభగలు కురిపిస్తున్న సంగతి తెలిసిందే. పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే రానున్న కొన్ని రోజులు ఎండ తీవ్రత మరింతగా పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

3లో..

## కల్తీ లేదు, కార్బైడ్ లేదు.. బాల్యం గుర్తొచ్చింది

### - రోడ్డు పక్కన తాటిముంజలు తిన్న చంద్రబాబు దంపతులు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** సీఎం నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటిస్తూ అటు ఆధ్యాత్మికతను, ఇటు గ్రామీణ స్వచ్ఛతను ఆస్వాదిస్తున్నారు. తన సతీమణి భువనేశ్వరితో కలిసి పర్యటనలో బిజీగా గడుపుతున్న ఆయన, కుప్పం ప్రజలతో మమేకమైన తీరుపై సోషల్ మీడియా వేదికగా ఆసక్తికరమైన పోస్టులు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కుప్పం పర్యటనలో భాగంగా ఆధ్యాత్మిక చింతనతో పాటు పల్లెటూరి స్వచ్ఛతను అక్కున చేర్చుకున్నారు. బుధవారం తన సతీమణి భువనేశ్వరితో కలిసి కుప్పంలోని ప్రసిద్ధ శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ తల్లి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ మర్యాదలతో స్వాగతం అందుకున్న ఈ దంపతులు, అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగలు, జాతరలు మన సంస్కృతిలో భాగమని, ఇటువంటి

2లో..

## తమిళనాడు ప్రభుత్వంలోకి కాంగ్రెస్

- ఇద్దరికీ మంత్రులుగా చాన్స్
- గురువారమే విజయ్ కేబినెట్ విస్తరణ



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విజయ్ ఇప్పుడు పరిపాలనపై పట్టు బిగించేందుకు సిద్ధమయ్యారు. మే 10న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్, కేవలం 9 మంది మంత్రులతో చిన్న కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం రాజ్‌భవన్‌లో పూర్తి స్థాయిలో

2లో..

## ప్రతి సమస్యకు చర్చలతోనే పరిష్కారం

### - ఇటలీ పర్యటనలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఇటలీ పర్యటనలో పలు కీలక ఒప్పందాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతకాలు చేశారు. ఇటలీ ప్రధాని మెలోనితో చర్చలు సక్సెస్ అయ్యాయని అన్నారు. 2029 వరకు ఇటలీ కంపెనీలు భారత్‌లో 20 బిలియన్ యూరోల పెట్టుబడులు పెడుతాయని తెలిపారు. ఏఐ, క్వాంటమ్ రంగాల్లో కలిసి పనిచేయాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి. ఇటలీ ప్రధాని మెలోనిని భారత్‌కు రావాలని ఆహ్వానించారు మోదీ. భారత్‌లో 800 ఇటలీ కంపెనీలు ఉన్నాయన్నారు మోదీ. రెండు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు మరింత

2లో..

## 5లక్షల బీమాతో పాటు సామాన్యులకు భారీ వరాలు

### - రేవంత్ సర్కార్ జూన్ 2 బిగ్ ప్లాన్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విభిన్న వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ వరాలను ప్రకటించబోతోంది. జూన్ 2న రానున్న తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని యంత్రాంగం సరికొత్త సంక్షేమ పథకాల అమలుకు సర్వం సిద్ధం చేస్తోంది. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు, సమాజంలోని పేద, మధ్యతరగతి వర్గాలకు ఊరటనిచ్చే పలు నిర్ణయాలను ఆ రోజే అధికారికంగా వెల్లడించనున్నారు.

**రూ. 5లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా**

త్వరలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో వీటికి సంబంధించిన తుది

3లో..

## అంతర్జాతీయ స్థాయి సంస్థలను
# ఫ్యూచర్‌సిటీకి తీసుకురావాలి

కేటాయించాలని విజ్ఞప్తి చేద్దాం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి

'జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటు కు శంకుస్థాపన జరిగేలా చూడాలి. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలి'అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.'ఇన్వెస్ట్ తెలంగాణ పేరులో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి అని ఆదేశించారు.'ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో,వెబ్ సైట్ రూపొందించాలి. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థని రూపొందించాలి.గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలి'అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలి

'తమిళనాడు,గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలి. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలి'అని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.'1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలి. డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలి. జీసీసీలు, డేటా సెంటర్లు కోసం కరీంనగర్,వరంగల్,విజయవాడ రోడ్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలి. ద్వితీయ శ్రేణి నగరాలల్లో జీసీసీ (గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్) ఏర్పాటు పైన దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలి. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు టీ ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందే'అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## కులగణనకు లైన్ క్లియర్

ఈ పిటిషన్‌ను తిరస్కరించడమే కాకుండా సామాజిక సంక్షేమానికి సంబంధించి కొన్ని అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది.

### పాలసీ విషయాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవు!

జనాభా గణన అనేది పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణం కనిపించడం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. "జనగణన కుల ప్రాతిపదికన జరగాలా? వద్దా? అనేది పూర్తిగా ప్రభుత్వ పరిధిలోని అంశం. దేశంలో వెనుకబడిన తరగతుల జనాభా ఎంత ఉందో, వారి సామాజిక స్థితిగతులు ఎలా ఉన్నాయో ప్రభుత్వం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే వారికి సరైన సంక్షేమ పథకాలను, అభివృద్ధి ఫలాలను అందించడం ప్రభుత్వానికి సాధ్యమవుతుంది" అని వ్యాఖ్యానించారు. ఈ అంశం పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయాల పరిధిలోకి వస్తుందని, అందువల్ల దీనిపై జ్యుడీషియల్ రివ్యూకు తావులేదని కోర్టు స్పష్టం చేసింది.

### పిటిషనర్ ఆందోళన..

అంతకుముందు పిటిషనర్ సుధాకర్ గుమ్ముల కోర్టులో తన వాదనలను వినిపిస్తూ ఇంత భారీ స్థాయిలో కులాల వారీగా సమాచారాన్ని సేకరించడం వల్ల సమాజంలో లేనిపోని సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ డేటాను రాజకీయ నాయకులు, కార్పొరేట్ సంస్థలు లేదా వివిధ ఏజెన్సీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఇది సామాజిక, రాజకీయ సంక్లిష్టతలకు దారి తీస్తుందని వాదించారు. అందువల్ల ఈ డేటా సేకరణకు ఎలాంటి సమర్థన లేదని ఆయన కోర్టుకు సమర్పించారు.అయితే ఈ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. వివిధ సామాజిక సమూహాలు, వెనుకబడిన తరగతుల విస్తృతిని, వారి వాటాను ఖచ్చితంగా అంచనా వేయడానికి ప్రభుత్వానికి ఈ విధమైన అధికారిక డేటా చట్టబద్ధంగా అవసరం కావచ్చునని కోర్టు అభిప్రాయపడింది. న్యాయపరమైన జోక్యానికి ఎలాంటి బలమైన ప్రాతిపదిక లేదని పేర్కొంటూ "ఇది పాలసీ మ్యాటర్.. జోక్యం చేసుకోలేం" అని ఆర్డర్ ఇస్తూ పిటిషన్‌ను తోసిపుచ్చింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో 2027 జనగణనలో కులాల వారీగా వివరాల సేకరణ ప్రక్రియకు ఉన్న లీగల్ అడ్డంకులు పూర్తిగా తొలగిపోయినట్లయింది.

## ఎక్కడైనా కొడుకును తండ్రి పోలీసులకు అప్పగిస్తాడా.?

పెట్టబోతున్నట్లు వస్తున్న వార్తలను ఫాల్తుగాళ్లు చేస్తున్న ప్రచారాలుగా బండి సంజయ్ కొట్టిపారేశారు. బీజేపీ అంటే ఏమిటో, బండి సంజయ్ అంటే ఏమిటో రాష్ట్ర ప్రజలందరికీ, కార్యకర్తలకు బాగా తెలుసునన్నారు. ఉరిశిక్ష పడే ముందు చివరి కోరిక ఏమిటని బీజేపీలో నిబద్ధతతో పనిచేసే ఏ కార్యకర్తను అడిగినా చనిపోయాక తన శవంపై కాషాయ జెండా కప్పాలని కోరుకుంటారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నా చివరి కోరిక అదేనంటూ ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. తాము అంతర్గత శిక్షణా శిబిరాల ద్వారా ఎంతో మంది కార్యకర్తలను తయారు చేశామని, ఇలాంటి చౌకబారు ప్రచారాలకు స్పందించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

### బీఆర్ఎస్‌కు 17 మంది ఎంపీలు.. కేసీఆర్, కేటీఆర్‌లపై సెటైర్లు

కేంద్ర మంత్రివర్గం నుండి తనను బర్తరఫ్ చేయబోతున్నారని జరుగుతున్న ప్రచారంపై ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లపై బండి సంజయ్ ఘాటుగా సెటైర్లు వేశారు. "తెలంగాణలో బీఆర్ఎస్‌కు 17 మంది ఎంపీలు ఉన్నట్లు, వారి మద్దతుతోనే కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం నడుస్తున్నట్లు కొందరు మాట్లాడుతున్నారు. నన్ను మంత్రి పదవి నుంచి తీసేయాలనే నిర్ణయం బహుశా కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్ తీసుకున్నట్టున్నారు. ఇంకా ముందు ముందు వాళ్లు ఏం చేయబోతున్నారో వాళ్లనే అడగాలి" అంటూ ఎద్దేవా చేశారు. కేటీఆర్ విసిరే చిల్లర మెతుకులకు ఆశపడి ఒకటి కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా అకౌంట్లు ఇలాంటి తప్పుడు కథనాలను వండివారుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వార్తలను చూసి కేసీఆర్ కొడుకు రాక్షసానందం పొందుతున్నాడని మండిపడ్డారు.

### నా కొడుకును పోలీసులకు అప్పగించినా దుష్ప్రచారం చేస్తున్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ గడీల పాలనను బద్దలుకొట్టి, వారి అవినీతి అరాచకాలను బొందపెట్టినందుకే వారు తనపై కక్షగట్టారని బండి సంజయ్ ఆరోపించారు. ఇక తన కుమారుడు బండి భగీరథ్ వివాదంలో అధికారాన్ని అడ్డుపెట్టుకున్నారనే ఆరోపణలను ఆయన పూర్తిగా తిరస్కరించారు. ఈ అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందన్నారు. ఏ తండ్రైనా కన్న కొడుకును నేరుగా పోలీసులకు అప్పగించిన సందర్భం ఉందా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. పోలీసులు విచారణ కోరగానే తానే స్వయంగా తన కొడుకును విచారణకు పంపానని స్పష్టం చేశారు. తాము ప్రజల్లో ఉంటూ, ప్రజాదరణ పొందుతున్న విషయాన్ని తట్టుకోలేకే కేటీఆర్ తన 'ఫేక్ మీడియా ఫ్యాక్టరీ' ద్వారా సోషల్ మీడియాలో ఇలాంటి విషప్రచారం చేయిస్తున్నారని, ఈ ఫేక్ వార్తలను చూసి జనం నవ్వుకుంటున్నారని బండి సంజయ్ విమర్శించారు.

## తమిళనాడు ప్రభుత్వంలోకి కాంగ్రెస్

మంత్రివర్గాన్ని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి విజయ్ వద్దే హోం, పోలీస్ సహా దాదాపు 20 కీలక శాఖలు ఉన్నాయి. మే 21 ఉదయం గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సమక్షంలో కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

### ఎంత మంది మంత్రులు రాబోతున్నారు?

తాజా సమాచారం ప్రకారం, ఈ విస్తరణలో సుమారు 14 మంది కొత్త మంత్రులను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉంది. ఇందులో 12 మంది టీవీకే నుంచి ఉండగా, మిత్రధర్మాన్ని పాటిస్తూ కాంగ్రెస్‌కు 2 మంత్రి పదవులు కేటాయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కేబినెట్‌లో సీఎం సహా కేవలం 10 మంది మాత్రమే ఉన్నారు. రేపటి విస్తరణతో ఈ సంఖ్య 24కు చేరనుంది. కాంగ్రెస్ తరపున ఇద్దరు మంత్రులుగా ప్రమాణం చేస్తున్నారని కేసీ వేణుగోపాల్ ప్రకటించారు.

### రెబల్స్‌కు చెక్.. మిత్రులకే ప్రాధాన్యత!

అన్నాడీఎంకే నుంచి తిరుగుబాటు చేసిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కుతాయని గతంలో ప్రచారం జరిగినప్పటికీ, విజయ్ వారిని పూర్తిగా పక్కన పెట్టారు. కాంగ్రెస్, వీసీకే, లెఫ్ట్ పార్టీల వంటి మిత్రపక్షాల నుంచి వచ్చిన ఒత్తిడితో, కేవలం నమ్మకస్తులకు, సెక్యులర్ కూటమిలోని మిత్రులకే చోటు కల్పించాలని విజయ్ నిర్ణయించుకున్నారు. సామాజిక సమీకరణాలను బట్టి మహిళలకు, దళిత వర్గాలకు కూడా ఈ విడతలో ప్రాధాన్యత లభించనుంది. మంత్రివర్గం అసంపూర్తిగా ఉంటే పాలన కష్టమవుతుందని భావించి, విజయ్ ఈ దిశగా వేగంగా అడుగులు వేశారు. కేరళ పర్యటనలో ఉన్న గవర్నర్ అర్లేకర్ చెన్నైకి చేరుకున్నారు. రాజ్‌భవన్‌లో సరళంగా జరిగే ఈ కార్యక్రమంలో కొత్త మంత్రులు బాధ్యతలు స్వీకరిస్తారు.

### కీలక నేతలకు చోటు?

టీవీకేలో కీలక పాత్ర పోషిస్తున్న బుస్సీ ఆనంద్, ఆధవ్ అర్జున వంటి వారు ఇప్పటికే మంత్రులుగా ఉండగా, మాజీ అన్నాడీఎంకే సీనియర్లు గతంలోనే టీవీకేలో చేరిన వారు మరియు , యువ నేతలకు అవకాశం దక్కే ఛాన్స్ ఉంది.

## ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో
# నమ్మకం కలిగించండి

జిల్లాలో 3,665 మంది డ్రాపౌట్స్ ఉన్నారని, ఎన్ రోల్ కానివారు 14,840 మంది ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు అసలు ఎన్‌రోల్ కానివారిపై దృష్టిసారించామని చెప్పారు. పలు మండలాల్లో సూడెంట్స్ అటెండెన్స్ తక్కువగా ఉండటంపై తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు వివరించారు. పదో తరగతి పరీక్షల్లో ఈ ఏడాది 80.47శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. 500కు పైగా మార్కులు సాధించిన వారు 2,789 మంది ఉన్నారని తెలిపారు.

### ప్రతి విద్యార్థిని ట్రాక్ చేయాలి

ప్రకాశం జిల్లాలో విద్యార్థుల డ్రాపౌట్స్ పై మంత్రి లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. వలస వెళ్లే వారిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పాఠశాలకు సెలవుల అనంతరం విద్యార్థులు ఏ ప్రాంతానికి వెళ్లినా వారి చదువు కొనసాగేలా ట్రాక్ చేయాలని ఆదేశించారు. సీజనల్ హాస్టల్స్ ను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో స్టూడెంట్, టీచర్ అటెండెన్స్ తక్కువగా ఉందని, లీప్ యాప్ లో టీచర్ అటెండెన్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని సూచించారు. స్టూడెంట్, టీచర్ రేషియోపైనా దృష్టిసారించాలన్నారు. ప్రకాశం జిల్లా డీఈవో సీవీ రేణుక స్పందిస్తూ.. ఈ ఏడాది జిల్లాలో పది శాతం ఎన్ రోల్ మెంట్ పెరిగిందని చెప్పారు. పాఠశాలలకు సెలవుల అనంతరం వ్యవసాయ పనుల్లో పడి విద్యార్థుల హాజరు నమోదు తక్కువగా ఉంటోందని వివరించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారని, పదో తరగతి టాపర్లను సన్మానించారని తెలిపారు. వచ్చే ఏడాది మరింత ఉత్తమ ఫలితాలు సాధిస్తామని చెప్పారు.

### బాల్యవివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు జిల్లాలో బాల్య వివాహాల పట్ల మంత్రి నారా లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో జీఎఫ్ఎల్ఎన్ పై దృష్టి సారించాలని ఆదేశించారు. స్టూడెంట్స్ ఫెర్ఫార్మెన్స్ కూడా తక్కువగా ఉందని, ఓవరాల్ ఫెర్ఫార్మెన్స్ లో కూడా చిత్తూరు వెనుకబడి ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. చిత్తూరు డీఈవో కే.రాజేంద్రప్రసాద్ స్పందిస్తూ.. చిత్తూరుకు తమిళనాడు, బెంగళూరు దగ్గరగా ఉండటంతో డ్రాప్ అవుట్స్ ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. పలుచోట్ల బాల్యవివాహాలు కూడా జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. లీప్ యాప్ డౌన్ లోడ్స్ పై దృష్టికేంద్రీకరిస్తామని చెప్పారు.

### ఏఎస్ఆర్ జిల్లాకు అన్ని విధాల అండగా ఉంటాం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, ఆ జిల్లాకు అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి లోకేశ్ చెప్పారు. హైస్కూల్స్ లో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉండటంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై దృష్టిసారించాలని ఆదేశించారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో విద్యార్థుల చేరిక తక్కువగా ఉందని, దీనిపైనా దృష్టిపెట్టాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాలపై స్పందిస్తూ, అక్కడి విద్యార్థుల్లో కసి ఉందని, వారికి దిశానిర్దేశం చేస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. డీఈవో కే.రామకృష్ణారావు స్పందిస్తూ.. జిల్లాలో 3,242 మంది డ్రాపౌట్స్ ఉన్నారు. స్టూడెంట్స్ యావరేజ్ అటెండెన్స్ 79.30 శాతం ఉందని, టీచర్ల సరాసరి హాజరు 78.40 శాతంగా ఉందని వివరించారు.

### స్లిప్ టెస్ట్ అటెండెన్స్ పై దృష్టిపెట్టాలి

ఏలూరు జిల్లాలో స్లిప్ టెస్ట్ అటెండెన్స్ తక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారించాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. టీచర్ అటెండెన్స్ పైనా దృష్టిసారించాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఎందుకు వెనుకబడి ఉన్నారని మంత్రి ఆరా తీశారు. కొన్ని మండలాల్లో ఉత్తీర్ణతా శాతంపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ స్పందిస్తూ.. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. టీ టైమ్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల పనితీరు గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నట్లు చెప్పారు.

### విద్యార్థుల హాజరుపై దృష్టి కేంద్రీకరించాలి

పల్నాడు జిల్లాలో విద్యార్థుల హాజరుపై దృష్టికేంద్రీకరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. టీచర్ అటెండెన్స్, లీప్ యాప్ డౌన్ లోడ్స్ పైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పల్నాడు జిల్లాలో స్కూల్ అకడమిక్ స్టార్ రేటింగ్ లో హైస్కూల్స్ ఎక్కువగా 3స్టార్ రేటింగ్ లో ఉండటం పట్ల మంత్రి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా కృషిచేయాలన్నారు. పల్నాడు డీఈవో పీవీజే రామారావు స్పందిస్తూ.. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో ఇన్ ఫ్రాస్ట్రక్చర్, విద్యార్థుల డ్రాపౌట్స్ పై దృష్టిసారించినట్లు చెప్పారు.

### కర్నూలు జిల్లాపై ప్రత్యేక దృష్టిసారిస్తాం

కర్నూలు జిల్లా ఫలితాల పట్ల మంత్రి లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. యువగళం పాదయాత్ర సమయంలో కర్నూలు జిల్లాలో భయానక పరిస్థితులు చూశానని, కర్నూలు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం అవసరమైన అన్ని చర్యలు చేపడతామని చెప్పారు. ఇందుకు సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం, డ్రాపౌట్స్ పై ఎక్కువ దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్, పదో తరగతి పరీక్షా ఫలితాలు, టీచర్, స్టూడెంట్స్ అటెండెన్స్ లో జిల్లా వెనుకబడి ఉందని చెప్పారు.

### మన్యం జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం బాగుంది

పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం బాగుందని, ఇందుకు గల కారణాలను మంత్రి లోకేశ్ ఆరా తీశారు. జిల్లాలో జీఎఫ్ఎల్ఎన్ ఇంప్రూవ్ మెంట్ కు ఇంకా అవకాశం ఉందని, దీనిపై దృష్టిసారించాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం పట్ల కూడా జాగ్రత్త వహించాలని సూచించారు. ముస్తాబు కార్యక్రమాన్ని ప్రశంసించారు. డీఈవో పి. బ్రహ్మాజీ రావు స్పందిస్తూ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో ఉందని చెప్పారు. త్వరలో 6వేల మంది విద్యార్థులతో కోలాటం కార్యక్రమం నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

### అకడమిక్ ఎక్స్ లెన్స్ పై దృష్టిపెట్టండి

పశ్చిమ గోదావరి జిల్లాలో అకడమిక్ ఎక్స్ లెన్స్ పై దృష్టికేంద్రీకరించాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్, స్టూడెంట్–టీచర్ రేషియో బాగుందని ప్రశంసించారు. డీఈవో నారాయణ స్పందిస్తూ ప్రైమరీ స్కూల్స్ లో టీచర్ అటెండెన్స్ తక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారిస్తామని చెప్పారు. డోర్ టూ డోర్ ప్రచారంలో లీప్ యాప్ డౌన్ లోడ్స్ పై దృషిపెడతామని తెలిపారు. తిరుపతి జిల్లాకు చెందిన ఎస్జీటీ వాణి, అనంతపురం జిల్లా డీఈవో మోహన్ కృషిని మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఏపీలో పనిచేయాలి

ఆధునిక ప్రపంచానికి వారధిగా శ్రీరవిశంకర్ గురూజీ వ్యవహరిస్తున్నారుని అన్నారు. హింసలేని సమాజం–ఒత్తిడి లేని మనుషులు అనే అంశాన్ని సాధించాలని దశాబ్దాలుగా బోధిస్తూ మానవాళికి గొప్పసేవ చేస్తున్నారని కితాబిచ్చారు.యుద్ధాలతో శాంతికి దూరమైన సమాజాన్ని, అనిశ్చితి నుంచి బయటపడేసేలా మానవత్వం అనే అత్యుత్తమ మార్గాన్ని ఆయన ఎంచుకున్నారని కొనియాడారు. యుద్ధక్షేత్రాల నుంచి ట్రాన్స్ ఫర్మేటివ్ పవర్, డైలాగ్, ఇన్నర్ స్ట్రెంత్ అనే విధానాలను అనుసరించారని పేర్కొన్నారు. గ్రామాల నుంచి అంతర్జాతీయ స్థాయి సంస్థల వరకూ, అనిశ్చితి నెలకొన్న కొలంబియా ప్రాంతాల వరకూ చర్చలు అనే శాంతి మార్గం ద్వారా మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. సామాన్య ప్రజలతో పాటు అంతర్జాతీయ సంస్థల విశ్వాసాన్ని గెలుచుకున్న ఆధ్యాత్మికవేత్త శ్రీ రవిశంకర్ గురూజీ అన్నారు.45 ఏళ్లక్రితం హ్యాపీ హ్యూమన్ బీయింగ్, స్ట్రెస్ ఫ్రీ సొసైటీ బెటర్ వరల్డ్ అనే విజన్ తో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోట్లాది మందికి ప్రేరణగా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. సురక్షిత తాగునీరు, రివర్ రిజునవేషన్, మహిళా స్వయం సమృద్ధి, విలువలతో కూడిన విద్య లాంటి రంగాల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ను ఆయన అభినందించారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రోజువారీ జీవితంలో చాలా ప్రభావాన్ని చూపిస్తున్నాయని వెల్లడించారు. భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్నాయని, సామాన్య ప్రజల జీవితాలు కూడా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోందని అన్నారు. గ్యాస్, ఇంధనం లాంటి వనరుల మార్కెట్ లభ్యత ప్రజలను ఒత్తిడికి గురి చేస్తోందని తెలిపారు. ఈ సమయంలో ఒత్తిడిని ఎదుర్కోని సమర్ధంగా జీవించాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలోనే ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు మానవాళికి అత్యుత్తమ సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.ప్రధాని మోదీ లాంటి సమర్థవంతమైన నేత దేశానికి నేతృత్వం వహిస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రగామిగా మారుతుందని జోస్యం చెప్పారు. వేల ఏళ్ల క్రితం వరకూ మానవాళిని నడిపించిన నేల ఇది. ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించిన దేశం మనదని పేర్కొన్నారు. ఆధునిక జీవనంలో శాంతిని సాధించేలా శ్రీ రవిశంకర్ గురూజీ తన బోధనలతో ప్రభావితం చేశారని, సంస్కృతితో మిళితమైన ఆధునికత, విలువలతో కూడిన జీవనం లాంటి ఎన్నో అంశాల ద్వారా తన బోధనల్ని సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో మేం కూడా ప్రజాప్రతినిధులు, అధికారులకు కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా తరగతులు నిర్వహించామని గుర్తు చేశారు.కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన నేల నుంచి తాను వచ్చానని, ప్రపంచంలో ఉండే హిందువులంతా ఒక్కసారైన తిరుపతి శ్రీవారిని దర్శించుకోవాలని అనుకుంటారని అన్నారు. శ్రీశైలం, ఆహోబిలం, అన్నవరం, సింహాచలం లాంటి అధ్యాత్మిక క్షేత్రాలు నిండిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు.

ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను రాష్ట్రంలో నిర్మిస్తున్నామని, పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక ప్రగతి, టెక్నాలజీ మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మార్చటమేననేది తన భావన అన్నారు. ప్రతీ పౌరుడూ శాంతి సౌఖ్యాలు, ఆనందంగా జీవించాలన్నదే తన అభిప్రాయమని పేర్కొన్నారు. ఏపీ సమీకృత అభివృద్ధి సాధించాలన్నదే తన లక్ష్యం కూడా అన్నారు.ఏపీలోని ప్రతీ పౌరుడికీ అత్యుత్తమ జీవన ప్రమాణాలు కల్పించేలా సంకల్పం తీసుకున్నామని చంద్రబాబునాయుడు అన్నారు. అందుకే పీ4 లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అందుకే స్వర్ణాంధ్ర 2047 విజన్ కూడా అమలు చేశామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తయారు చేయటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సాంకేతికత సాయంతో ఏపీని గ్లోబల్ ఎకానమీలో ఓ కీలకమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. అదే సమయంలో ఎలాంటి ఒత్తిడిలేని సమాజాన్ని కూడా తీసుకురావాలని పేర్కొన్నారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇంత అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ ప్రజల్లో శాంతి సౌఖ్యాలు రావాలంటే ఆధ్యాత్మికత అవసరమని పేర్కొన్నారు. దీనికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు ఏపీలో పనిచేయాలని కోరారు.

## ప్రతి సమస్యకు చర్చలతోనే పరిష్కారం

బలపడ్డాయని అన్నారు. డిజైన్లకు ఇటలీ పుట్టినిల్లని అన్నారు. నైపుణ్యత విషయంలో భారత్‌తో పాటు ఇటలీ కూడా టాప్‌లో ఉందన్నారు. యోగాకు ఇటలీలో ఎంతో ఆదరణ ఉందన్నారు మోదీ. భారత్–ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఇరుదేశాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రతి సమస్యకు చర్చల తోనే పరిష్కారం లభిస్తుందని ఉక్రెయిన్–రష్యాన్ని ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. టెర్రర్ ఫండింగ్‌తో ప్రపంచశాంతికి ముప్పు పొంచి ఉందన్నారు.ఐమెక్ కారిడార్‌పై ఇరు దేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి, ఐమెక్ కారిడార్ అమలుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించాయి.

భారత్–మధ్యప్రాచ్యం–యూరప్ ఆర్థిక కారిడార్ ద్వారా అనుసంధానమే లక్ష్యమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పశ్చిమ ఆసియా, యూరప్ యుద్ధాలపై చర్చించిన నేతలు, శాంతి దిశగా చర్చలే మార్గమని స్పష్టీకరించారు. ఇండో–పసిఫిక్ రీజియన్‌లో పరస్పర సహకారంపై ప్రధాని మోదీ, ఇటలీ ప్రధాని మెలోని ఏకాభిప్రాయం వ్యక్తంచేశారు. భారత్–యూరోపియన్ యూనియన్ సంబంధాల బలోపేతంపై ఇరు దేశాలు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి యుద్ధాల పరిష్కారానికి దౌత్యమే ఏకైక మార్గమని ప్రపంచ శాంతికి కట్టుబడి ఉన్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాగా.. అంతకుముందు భారత ప్రధాని మోదీకి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఘనంగా స్వాగతం పలికారు. ఇటలీ బృందంతో కలిసి ప్రధాని మోదీ డిన్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆ తర్వాత చారిత్రక కొలోసియంలో మోదీ–మెలోనీ కలియదిరిగారు. ఇటలీ చరిత్రకు సాక్ష్యంగా నిలిచే ఈ స్టేడియం గురించి మోదీకి మెలోని వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో ఆమె సెల్ఫీ దిగారు. వెల్‌కమ్ టు రోమ్, మై ఫ్రెండ్ అంటూ ఆమె ట్వీట్ చేశారు.

## కల్తీ లేదు, కార్బైడ్ లేదు.. బాల్యం గుర్తొచ్చింది

కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### రాష్ట్ర అభివృద్ధి కోసం గంగమ్మకు ప్రార్థన

అమ్మవారిని దర్శించుకున్న అనంతరం చంద్రబాబు రాష్ట్ర ప్రజల క్షేమం కోసం ప్రార్థించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలనే తమ నిరంతర ప్రయత్నాలకు ఆ గంగమ్మ తల్లి చల్లని దీవెనలు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కుప్పం ప్రజలతో పాటు యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంతా మేలు జరగాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు, స్థానికులతో ఆయన ఆత్మీయంగా ముచ్చటించారు.

### మనసును తాకిన తాటి ముంజల రుచి

దేవాలయ దర్శనం ముగించుకుని వెళ్తుండగా, చంద్రబాబు కాన్వాయ్ రోడ్డు పక్కన ఉన్న తాటి ముంజల బండి వద్ద ఆగింది. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ఆయన అక్కడ ఆగి తాటి ముంజలను రుచి చూశారు. కల్తీ లేదు.. కార్బైడ్ లేదు.. పురుగు మందుల గోల లేదు మా కుప్పం ప్రజల మనసుల్లాంటి స్వచ్ఛమైన, చల్లనైన తాటి ముంజలు తింటుంటే ఎంతో హాయిగా ఉంది అంటూ చంద్రబాబు మురిసిపోయారు. మన గ్రామీణ ఆహార ఉత్పత్తుల్లో ఉండే సహజ సిద్ధమైన రుచి మరెక్కడా దొరకదని ఆయన కొనియాడారు.

### గ్రామీణ ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా సీఎం

ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అయి ఉండి కూడా సాధారణ పౌరుడిలా రోడ్డు పక్కన ఆగి పల్లెటూరి ఫలాలను ఆస్వాదించడం స్థానికులను విశేషంగా ఆకర్షించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రాణం పోసే స్థానిక ఉత్పత్తులకు చంద్రబాబు స్వయంగా ప్రచారం కల్పించడం పట్ల నెటిజన్ల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రబాబు కుప్పం పర్యటన అటు అభివృద్ధి సమీక్షలతో, ఇటు ఆత్మీయ పలకరింపులతో అత్యంత సందడిగా సాగుతోంది.

## విద్యారంగ పెట్టుబడులకు
## ఎఫ్ఆర్బీఎం మినహాయింపు ఇవ్వండి



వ్యయాలకు సంబంధించిన పలు కీలకమైన అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర పురోగతికి కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన పూర్తి స్థాయి సహకారంపై ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు.రాష్ట్రంలో మౌలిక సదుపాయాల రంగాన్ని మరింత పరుగులు పెట్టించేందుకు గాను, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన "రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయ పథకం" కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని భట్టి విక్రమార్క కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ప్రస్తుతం విద్య, వైద్యం, గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతుల కల్పనతో పాటు మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో ప్రభుత్వం అత్యంత భారీగా పెట్టుబడులు పెడుతోందని వివరించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నడుస్తున్న తమ ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్షుణ్ణంగా వివరించారు. ఈ భేటీలో ప్రధానంగా విద్యా రంగానికి సంబంధించిన నిధుల సమీకరణపై కీలక చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్" సహా విద్యా రంగంలో చేపడుతున్న భారీ పెట్టుబడుల ప్రాజెక్టుల గురించి భట్టి విక్రమార్క ప్రస్తావించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్ ఇప్పటికే ఆమోదం తెలిపిన విదేశీ ద్రవ్య సహకార ప్రాజెక్టులకు సంబంధించిన నిధుల వినియోగంలో, రాష్ట్రానికి ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నుంచి ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు. ఈ మినహాయింపు లభిస్తే విద్యా రంగంలో తలపెట్టిన అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా, వేగంగా పూర్తవుతాయని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాఘవపురం జోరుగా మట్టి తోలకాలు

**- చెరువును తవ్వి నల్లమట్టి తరలింపు**

**- కన్నెత్తి చూడని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు**



**కోరుకొండ** మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా రాఘవపురం చెరువు నల్ల మట్టి తరలిస్తున్నారు . జెసిపిలతో చెరువుని తవ్వి అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. గత రెండు నెలలుగా అక్రమ మట్టి తరలింపులు జరుగుతున్నాయి. ఇంత అక్రమ మట్టి తరలించిపోతున్న ఇరిగేషన్ శాఖ రెవిన్యూ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం కోస మెరుపు. తూతూ మంత్రంగా పరిమిషన్ లు తీసుకొని అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టి అమ్ముకుంటున్నారు. అక్రమంగా లక్షలు మట్టి అమ్ముకుంటున్న స్థానిక ప్రజాప్రతినిధులు గాని ప్రభుత్వ అధికారులు కానీ స్పందించకపోవడం గమనహారం. అక్రమ మట్టి తరలింపులు ఎనకాల బడా బాబులు హస్తం ఉన్నట్లు కూడా ప్రసారం జోరుగా సాగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మట్టి మాఫియా రెచ్చిపోతుందని గుసగుసలు జోరుగా వినిపిస్తున్నాయి. చెరువును చూస్తే అక్రమార్కులు కన్నేసి రైతుల పేరు మీద తూత్ మంత్రంగా పర్మిషన్ తెచ్చుకొని అక్రమంగా మట్టి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికార పార్టీ యంత్రాంగం మాట పక్కన పెడితే ప్రతిపక్షం కూడా నోరు ఎత్తకపోవడం పలు అనుమానాలు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధించిన శాఖ అధికారుల స్పందించి రాఘవపురం. చెరువు తవ్వి అక్రమంగా నల్ల మట్టి తరలిస్తున్న వారు పైన చర్యలు తీసుకుని అక్రమ మట్టి అడ్డుకట్టు వేయాలని పరువురు కోరుతున్నారు

# బద్వేలులో కెమిస్టుల సమ్మె విజయవంతం

**- తాహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన అసోసియేషన్ నాయకులు**



**బద్వేలు** అఖిల భారత కెమిస్టుల సమాఖ్య పిలుపులో భాగంగా బద్వేలు పట్టణంలో గురువారం నిర్వహించిన కెమిస్టుల సమ్మె పూర్తిగా విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పట్టణంలోని మెడికల్ షాపులన్నింటినీ మూసివేసి నిరసన వ్యక్తం చేశారు.?ఈ సందర్భంగా బద్వేలు మెడికల్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సముద్రాల రాధాకృష్ణమూర్తి, గౌరవాధ్యక్షులు కె.వి. సుబ్బారావు, వేలూరి మురళీధర్ రెడ్డి, సెక్రటరీ దర్శి సుబ్బరాజా, ట్రెజరర్ మాలేపాటి సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి మరియు పలువురు మెడికల్ షాపుల యజమానుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.?పోటీ శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు:ముందుగా సిద్ధవటం రోడ్డులోని అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ప్రధాన రహదారుల గుండా నినాదాలు చేస్తూ బద్వేలు తాహసిల్దార్ కార్యాలయం వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.?ప్రధాన డిమాండ్లు ఇవే:?ఆన్‌లైన్ ద్వారా మందుల అమ్మకాలను (ఇ-ఫార్మసీ) తక్షణమే నిలిపివేయాలి.?నిబంధనలకు విరుద్ధంగా ఇస్తున్న అధిక డిస్కౌంట్లను అరికట్టాలి.?ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతూ, నాసిరకం మందులు తయారు చేసే కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.?ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు కిషోర్ కుమార్, నిమ్మకాయల భీమారెడ్డి, పత్తి నరసింహ, వెంకటరత్నం, సముద్రాల మల్లికార్జున, రవి, పామూరి వెంకటేశ్వర్లు, రమణ యాదవ్, వాసవి మెడికల్స్ నవీన్, దాసో సతీష్, కానుగల రఘురామయ్య, సురేష్, కందుకూరి రమేష్, మరియు పలువురు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పట్టణంలోని మెడికల్ షాపుల యజమానులు, అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు

# నకిలీ విసాతో వెళుతున్న వ్యక్తి అరెస్టు

**శంషాబాద్** శంషాబాద్ ఎయిర్ పోర్టు నుండి రసూల్ కైమా దేశం వెళుతున్న వ్యక్తిని ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నకిలీ విస్సాతో వెళ్ళేందుకు వచ్చినట్టు గుర్తించారు. నిందితుని ఎయిర్ పోర్ట్ ఔట్ పోస్ట్ పోలీసులకు అప్పగించారు. ఎయిర్ పోర్ట్ ఔట్ పోస్ట్ పోలీసులు నిందితుని విచారణ చేస్తున్నారు.

# గ్రామ పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి

**- రాష్ట్ర స్థాయి సర్పంచుల సమావేశం**

**హైదరాబాద్** వనస్థలిపురంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సౌదాని భూమన్న యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జక్క రాఘవేందర్ రెడ్డితో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన సర్పంచులు హాజరయ్యారు.సమావేశంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ నిధుల విడుదల, స్థానిక సంస్థలకు మరింత అధికారాల కల్పన, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, సర్పంచుల హక్కులను పరిరక్షించే దిశగా సంఘం రాష్ట్రవ్యాప్తంగా పోరాట కార్యాచరణ చేపడుతుందని తెలిపారు.

వివిధ జిల్లాల నుంచి వచ్చిన సర్పంచులు తమ ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించి పరిష్కార మార్గాలపై సూచనలు చేశారు.ఉపసర్పంచ్ కు జాయింట్ చెక్ పవర్ వెంటనే రద్దు చేయాలి. 3,74 రాజ్యాంగ సవరణలు ప్రకారం 29 అంశాలు వాతంత్ర పంచాయితీలకు బదలాయించాలి. పంచాయితీలను స్థానికప్రభుత్వాలుగా గుర్తించాలి. ఏకగ్రీవంగా ఎన్నికైన 2134 గ్రామపంచాయితీలకు ప్రభుత్వం ప్రకటించిన నజరానాను తక్షణమే విడుదల చేయలి. గ్రామ పంచాయితిలలో వీధి దీపములు, మంచినీటి పథకములకు విద్యుత్ ఛార్జీలు ప్రభుత్వమే భరించాలి.

పంచాయితీలకు కార్యాలయములు లేని గ్రామాలకు ప్రత్యేక నిధులతో వెంటనే కార్యాలయ భవనాలు నిర్మించాలి. సర్పంచ్లకు గౌరవ వేతనం రూ: 5 వేల నుండి రూ. 20 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవాలి. ఖాళీ వున్న గ్రామ పంచాయితీలలో కార్యదర్శులను నియమిచాలి పనిచేసే కారోబార్, పారిశుధ్య కార్మికులు మరియి యితర సిబ్బందికి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని తీర్మానించారు.

# జంట నగరాల్లో మెడికల్ షాపులు బంద్

**హైదరాబాద్** దేశ వ్యాప్తంగా బంద్ లో భాగంగా జంట నగరాల్లో ను మెడికల్ షాప్ లు మూసివేశారు.24 గంటల బంద్ కు దుకాణదారులు పిలుపునిచ్చారు.దీంతో ఉదయం నుంచే జంటనగరాల్లో మెడికల్ షాప్ లు మూతపడ్డాయి.కాగా ఆన్ లైన్ లో మందుల విక్రయం వల్ల తాము నష్టపోతున్నామని వారు పేర్కొన్నారు. హైదరాబాద్ లోని పంజాగుట్టలో ఆల్ ఇండియా కెమిస్ట్ డ్రగ్జిస్ట్ సంఘం హైదరాబాద్ నేతలు సమావేశమయ్యారు.నగరంలో మెడికల్ షాపుల బంద్ జరుగుతుందని ఎక్కడ కూడా షాపులు తెరిచి లేవన్నారు.కాగా అసోసియేషన్ రాష్ట్ర ఉప అధ్యక్షుడు శ్రీధర్ గుప్తా మాట్లాడుతూ మెడికల్ షాపులు మూసివేశామన్నారు.మరో మెడికల్ యజమాని మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న మాట వాస్తవమేనన్నారు.అయితే ప్రభుత్వం ఆన్లైన్ మందుల విక్రయాలను ప్రోత్సహించడం వల్ల తాము నష్టపోతున్నామని చెప్పారు.కాగా మెడికల్ షాపుల బంద్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులతో ఈ అంశంపై చర్చించారు.ఎక్కడ అత్యవసర సేవలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు

# ఎపిక్ ఇంటర్నేషనల్ హాస్పిటల్

**- మెడ్ట్రానిక్ భాగస్వామ్యం**

**హైదరాబాద్** హైదరాబాద్ బంజారాహిల్స్ లోనీ మినిమల్లీ ఇన్వాసివ్ వీన్ కేర్ను విస్తరించేందుకు ఎపిక్ ఇంటర్నేషనల్ హాస్పిటల్, మెడ్ట్రానిక్తో ఒప్పందం కుదుర్చుకుంది. వెరికోస్ వీన్స్కు పెద్ద శస్త్రచికిత్సలు, కుట్లు లేకుండా గ్లూ థెరపీ, ఖీఈం, లేజర్ వంటి డే-కేర్ విధానాలతో చికిత్స. నొప్పి, మచ్చలు తక్కువ. వేగంగా కోలుకొని రోజువారీ పనులకు త్వరగా వెళ్లవచ్చు. నిపుణుల సంప్రదింపులు, అధునాతన నిర్ధారణ పరీక్షలు, ఫాలో-అప్ కేర్ అన్నీ ఒకే చోట. ఎపిక్ చైర్మన్ డా. బాలాజీ పటేల్ కోలా మాట్లాడుతూ, రోగులకు ఇంటికి దగ్గరలోనే ప్రపంచ స్థాయి వాస్కులర్ కేర్ అందించడమే ధ్యేయమన్నారు. మెడ్ట్రానిక్ సీనియర్ డైరెక్టర్ ప్రతీక్ తివారీ ప్రకారం, ఈ భాగస్వామ్యంతో సిరల ఆరోగ్యంపై అవగాహన పెంచి, ముందస్తు చికిత్సను ప్రోత్సహిస్తారు అని అన్నారు.

# రసాయన శాస్త్రంలో కేత స్వరూపకు పీహెచ్.డీ.



**పటాన్ చెరు,** హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కేత స్వరూప డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'చాల్కోన్ కలిపిన పిరిడిన్-పిరిమిడిన్, 1,2,4-ఆక్సాడయాజోల్ కలిపిన ఇండోలిజైన్-థయాడయాజోల్ ఉత్పన్నాల రూపకల్పన, సంశ్లేషణ, జీవ మూల్యాంకనం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిత్తలూరి సుధాకర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ స్వరూప చేసిన డాక్టరల్ పరిశోధన, ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సలో, ఆశాజనకమైన వైద్యపరమైన అనువర్తనాలు కలిగిన నూతన రసాయన సమ్మేళనాల అభివృద్ధిపై దృష్టి సారిస్తుందన్నారు. ఈ పరిశోధనలో భాగంగా, డాక్టర్ స్వరూప ఔషధ పరంగా ముఖ్యమైన రసాయన నిర్మాణాలను ఏకీకృతం చేయడం ద్వారా జీవశాస్త్ర పరంగా ప్రాముఖ్యత కలిగిన రెండు శ్రేణుల సమ్మేళనాలను రూపొందించి, సంశ్లేషించినట్టు తెలిపారు. సంశ్లేషించిన ఈ సమ్మేళనాలను ఎన్ఎంఆర్ స్పెక్ట్రోస్కోపీతో సహా ప్రామాణిక విశ్లేషణాత్మక పద్ధతులను ఉపయోగించి నిర్మాణాత్మకంగా వర్గీకరించి, తదనంతరం వాటి జీవ క్రియాశీలతను మూల్యాంకనం చేశారన్నారు. అనేక సమ్మేళనాలు ప్రోత్సాహకరమైన ఫలితాలను కనబరిచాయని, భవిష్యత్తు ఔషధ అభివృద్ధికి వాటి సామర్థ్యాన్ని సూచిస్తున్నాయని వివరించారు. ఈ అధ్యయనం ఔషధ రసాయన శాస్త్ర రంగానికి విలువైన అంతర్దృష్టులను అందిస్తుందని, క్యాన్సర్ చికిత్స కోసం సమర్థవంతమైన చికిత్సా ఏజెంట్ల అభివృద్ధికి కొత్త మార్గాలను తెరుస్తుందన్నారు. డాక్టర్ స్వరూప సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రతి సమస్యను పరిష్కరిస్తాం..

**- అభివృద్ధిలో ప్రతీకగా తీర్చిదిద్దుతాం**

**- బీరంగూడ, అమీన్పూర్ డివిజన్ల లో సుడిగాలి పర్యటన**

**- త్వరలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**- పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్ చెరు, మే 20,** అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికా బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని తులసి వనం కాలనీ, భ్రమరాంబిక నగర్ కాలనీ, ఏ ఆర్ బృందావన్ కాలనీ, కె ఎస్ ఆర్ కాలనీ, అంజనాద్రి కాలనీ, టైలర్ కాలనీ, ఎన్ ఎస్ ఎల్ కాలనీ, ఎన్ బి ఆర్ కాలనీ, ఇక్రిశాట్ కాలనీలలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటించారు. నేరుగా ప్రజలు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, యూజిడీలు, విద్యుత్, తాగు నీరు తదితర అంశాలపై చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను నివేదిక రూపంలో తనకు అందించాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయించి నిర్దేశించిన గడువుగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. అమీన్పూర్ పరిధిలో దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టడంతో పాటు, ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలకు సైతం అందించేందుకు ఇప్పటికే ప్రణాళికలు పూర్తయ్యాయని తెలిపారు. కాలనీలలో ప్రభుత్వ స్థలాలు పార్కులు కబ్జాలు గురికాకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య విషయంలో ప్రజలకు ఇబ్బందులకు తలెత్తకుండా నూతన సిబ్బందిని సైతం నియమిస్తున్నట్లు తెలిపారు. నూతన కాలనీలు ఏర్పడడంతో విద్యుత్ డిమాండ్ పెరిగిందని.. ఇందుకు అనుగుణంగా నూతన సబ్ స్టేషన్లతో పాటు పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు మాట్లాడటం తన నైజం అని, మిగతా సమయం ప్రజల అభివృద్ధి సంక్షేమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని.. అవసరమైన నిధులు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అతి త్వరలో బీరం గూడలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనన్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి నేరుగా ఎమ్మెల్యేనే స్వయంగాతమ కాలనీలకు రావడం పట్ల ఆయా కాలనీల ప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు బాలరాజు, కృష్ణ, యూనుస్, ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్ డిఈ వెంకటరమణ, జలమండలి డిజిఎం శివకుమార్, విద్యుత్ శాఖ ఏడి సంజీవ్, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాన్నం వేళ ప్రయాణాలు మానుకోండి

ఈ నేపథ్యంలోనే అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ప్రజలకు కూడా కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో తీవ్రమైన వడగాలులు, ఎండ తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని, తాగు నీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రుల వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బతో ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే వెంటనే తగిన వైద్య సహాయం అందించాలని చెప్పారు.పట్టణ ప్రాంతాల్లో అవసరమైన మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు మధ్యాహ్న ప్రయాణాలు చేయకుండా ఉండాలని ప్రజలకు సూచించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఇక, తెలంగాణలో రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల మేర పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే రాష్ట్రంలో బుధవారం రోజున గరిష్ట ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరువయ్యాయి. ఈ వేసవికాలంలో ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే తొలిసారి. బుధవారం రోజున రాష్ట్రంలో అత్యధికంగా దిలావర్‌పూర్ (నిర్మల్ జిల్లా) 46.5ఖీజ, ధర్మసాగర్ (హనుమకొండ జిల్లా) 46.4 ఖీజ, చొప్పదండి (కరీంనగర్ జిల్లా) 46.4 ఖీజ, ఓదెల (పెద్దపల్లి జిల్లా) 46.4 ఖీజ, రాయికల్ (జగిత్యాల జిల్లా) 46.3 ఖీజ, వడ్లకొండ (జనగాం జిల్లా) 46.3 ఖీజ, పెనుబలి (ఖమ్మం జిల్లా) 46.3 ఖీజ, కొమురం భీమ్ ఆసిఫాబాద్ 46.3 ఖీజ, కోటపల్లి (మంచిర్యాల జిల్లా) 46.3 ఖీజ, బాల్కొండ (నిజామాబాద్ జిల్లా) 46.3 ఖీజ, జైనద్ (ఆదిలాబాద్ జిల్లా) 46.2 ఖీజ, పినపాక (భద్రాద్రి కొత్తగూడెం 46.2 ఖీజ, తొర్రూర్ (మహబూబాబాద్ జిల్లా) 46.2 ఖీజ, కోహెడ (సిద్దిపేట జిల్లా) 46.2 ఖీజ, మేళ్లచెరువు (సూర్యాపేట జిల్లా) 46.2 ఖీజ, ఏటూరునాగారం (ములుగు జిల్లా) 46.1 ఖీజ, కోనరావుపేట (సిరిసిల్ల జిల్లా) 46.1 ఖీజ, కట్టంగూర్ (నల్గొండ జిల్లా) 46 ఖీజ, నల్లబెల్లి (వరంగల్ జిల్లా) 46 ఖీజ, మొగులపల్లి (భూపాలపల్లి జిల్లా) 45.8 ఖీజ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు. అత్యవసరం అయితే తప్ప ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

# 5లక్షల బీమాతో పాటు సామాన్యులకు భారీ వరాలు

విధివిధానాలు ఖరారు కానున్నాయి. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ధ్యేయంగా రేవంత్ ప్రభుత్వం 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకానికి రూపకల్పన చేసింది. ఈ పథకం కింద నమోదైన లబ్ధిదారులకు రూ. 5 లక్షల బీమా సౌకర్యం లభిస్తుంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఇందుకోసం సర్కారు సుమారు రూ. 4 వేల కోట్లను ప్రత్యేకంగా కేటాయించింది.

### కొత్త పెన్షనర్ లు పండుగ చేసుకునే రోజు

జూన్ 2వ తేదీన ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖ బీమా సంస్థ 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్' అధికారుల మధ్య ఈ ప్రాజెక్టుపై అధికారిక ఒప్పందం జరగనుంది. అంతేకాదు చాలా కాలంగా సామాజిక పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ఈ ఆవిర్భావ దినోత్సవం తీపి కబురు అందించనుంది. రాష్ట్రవ్యాప్తంగా అదనంగా మరో రెండు లక్షల మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### జూన్ 2 నుంచే ఇందిరమ్మ రెండో విడత నిధులు ఖాతాల్లో

దీనితో పాటు, సొంతంగా ఇల్లు నిర్మించుకోవాలనుకునే నిరుపేదల కోసం ఉద్దేశించిన 'ఇందిరమ్మ ఇండ్లు' పథకం రెండవ విడతకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. జూన్ 2 నుంచే ఈ పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లోకి గృహ నిర్మాణ ఆర్థిక సహాయ నిధులు విడుదల కానున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్ల చిరకాల డిమాండ్‌ను నెరవేరుస్తూ, జూన్ 2 నుండి పూర్తి స్థాయి డిజిటల్ హెల్త్ కార్డులను పంపిణీ చేయనున్నారు.

### డిజిటల్ హెల్త్ కార్డులు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచితంగా వైద్య సేవలు పొందేలా 'ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్' ద్వారా డిజిటల్ హెల్త్ కార్డుల వసతి కల్పిస్తున్నారు. మరోవైపు విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పుల్లో భాగంగా, ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నారు. భవిష్యత్తులో వీరికి ఉదయం పూట అల్పాహారం కూడా అందించే యోచనలో యంత్రాంగం ఉంది.

### జూన్ 2 నుండే సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 'సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్' జూన్ 2న ప్రారంభం కానుంది. దీని ద్వారా అభ్యర్థులకు విదేశాలలో ఉద్యోగాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అదే రోజున హైదరాబాద్‌లోని సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిలో పాక్షికంగా వైద్య సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి.

# నెల్లూరు జిల్లా వ్యాప్తంగా "ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం



**నెల్లూరు** బుధవారం తెల్లవారుజామున నెల్లూరు జిల్లా వ్యాప్తంగా "ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్పై ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టారు.నగరం మరియు శివారు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో విస్తృత పెట్రోలింగ్ నిర్వహించి అనుమానితులపై తనిఖీలు చేపట్టారు. ప్రజలు అనుమానాస్పద విషయాలు గమనిస్తే వెంటనే 112 లేదా ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# సత్యకుమార్.. నీకు దమ్ముంటే రాజీనామా చేసిరా

**- మంత్రి సత్యకుమార్పై ధర్మవరంలో సొంత పార్టీ నేతల ఆగ్రహం**

**ధర్మవరం** మంత్రి సత్యకుమార్ ఓ బ్రోకర్, హనీ ట్రాప్ వెనుక ఉన్నాడంటూ బీజేపి, కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ధర్మావరం లో సత్యకుమార్కు వ్యతిరేకంగా టీడీపీ - బీజేపీ - కాంగ్రెస్ నేతలు ఆందోళన కు దిగారు. మంగళవారం నాడు హైకోర్టు న్యాయవాది అంజన్ రెడ్డిపై మంత్రి సత్యకుమార్ అనుచరులు దాడి చేసారని ఆరోపించారు. అందుకు నిరసనగా ధర్మవరం అంబేద్కర్ విగ్రహం ఎదుట బీజేపీ - టీడీపీ - కాంగ్రెస్ నేతలు ధర్నా చేపట్టారు. తప్పులను ప్రశ్నించే వారిపై దాడులు చేయడం దుర్మార్గం, మంత్రి సత్యకుమార్కు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని బీజేపీ నేత సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ నేత పరమేష్ తదితరులు హెచ్చరించారు

# సీఎం పేరు చెప్పుకుంటూ వసూళ్లు

**- ఆర్ఆర్ పెంచర్లో 5 విల్లాలు ఇవ్వాలంటూ డిమాండ్**
**- ఆర్ఆర్ వెంచర్ యజమాని ఫిర్యాదు తో వెలుగులోకి వచ్చిన సంతోష్ గుప్త బాగోతం**
**- సంతోష్ గుప్తా అక్రమాలు కోకొల్లలు**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల పేర్లు చెప్పుకుంటూ వసూళ్లకు పాల్పడిన వ్యక్తిని మేడ్చల్ పోలీసుల అరెస్టు చేశారు. తనకు సీఎంతో పాటు మంత్రులందరూ తెలుసని తాను ఏది చెప్తే అదేనంటూ బెదిరింపులకు పాల్పడుతూ వసూళ్లకు పాల్పడుతున్న వసూల్ రాజా సంతోష్ గుప్తాను మేడ్చల్ పోలీసుల అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసిపి వెంక రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మెదక్ జిల్లా శివంపేట కు చెందిన సంతోష్ గుప్తా ఎన్నో ఏళ్లుగా వసూల్ రాజా అవతారం ఎత్తాడు.



ఇతని బాధితులు కుత్బుల్లాపూర్, కొంపల్లి,సుచిత్ర మేడ్చల్ లో కోకొలల్లు. సీఎం రేవంత్ రెడ్డి పిఏ అంట చేలామణి అవుతూ సంతోష్ గుప్తా భూ వివాదాలు సెటిల్ మెట్లు చేస్తూ బాధితులను మోసం చేస్తున్నాడని తెలిపారు.

గతంలో పేట్బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాదం లో సీఐ ని ఇరికించి సస్పెండ్ చేయించడం పై కీలక పాత్ర పోసించినట్లు సమాచారం.

స్కూల్స్, బార్లు, రియల్ ఎస్టేట్ ఆఫీస్ లు, వెంచర్ నిర్వాహకులను లొసుగులు చూపి వారి పై ఆర్ టి ఐ వేసి బెదిరించిన దాకలాలు కోకొలలు. వ్యాపారాస్తులకు నేను సీఎం మనిషి ని,మంత్రులు నా మాట వింటారు అంటూ బురిడీ కొట్టించడం లో సంతోష్ గుప్తా కు వెన్న తో పెట్టిన విద్య. ఖరీదైన కారులో తిరుగుతూ, కద్దర్ బట్టలు వేసుకొని హుందాగా హోటల్లో కూర్చొని సెటిల్మెంట్లు బెదిరింపుల కు పాల్పడడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది.

**5 విల్లాల డిమాండ్ తో వెలుగులోకి అక్రమాలు**

తాజాగా మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మునిరాబాద్ లో ఆర్ఆర్ రియల్ ఇఎస్టేట్ వ్యాపారికి ఫోన్ చేసి నేను సీఎం పిఏ ను అంటూ మాట్లాడి మీ భూమిలో ఈ ప్రాబ్లం ఉంది వచ్చి కలవకుంటే ఈ పని చేస్తా అంటూ సంతోష్ గుప్తా బెదిరించడంతో బాధితుడు సైబరాబాద్ పోలీసులకు పిర్యాదు చేసాడు. దీంతో అతనిపై నిగా ఉంచిన పోలీసులు అదుపులోకి తీసుకొని అతని అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. విలేకరుల సమావేశంలో మేడ్చల్ సిఐ సత్యనారాయణ ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆశలకు గండి

## కమలం పార్టీలో ఎవరికి వారే.. యమునా తీరే



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ బీజేపీలో నేతల మధ్య సమన్వయం లేదు. ఎవరికి వారే తమ దారిలో వెళుతున్నారు. తెలంగాణలో అధికారంలోకి రావాలని కేంద్ర నాయకత్వం భావిస్తున్నప్పటికీ, రాష్ట్ర బీజేపీ నేతల మధ్య సమన్వయ లేమి ఆ ఆశలకు గండి కొట్టేలా కనిపిస్తుంది. ఎందుకంటే పైకి బాగున్నప్పటికీ లోలోపల ఒకరంటే ఒకరికి పడని పరిస్థితి. ఏ ఒక్క నేతకు మరొక నేత పడని పరిస్థితి వచ్చింది. అందరు నేతలు తాము తోపులమని భావించే స్థితికి రావడంతోనే తెలంగాణ బీజేపీలో ఈ పరిస్థితి తలెత్తిందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అందుకే ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తక్కువ స్థానాలకే బీజేపీ పరిమితం కావాల్సి వచ్చింది.

**- హైదరాబాద్ ఎన్నికల్లో..**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుంది. పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో కమలం పార్టీ కుదేలు కావడానికి నేతల మధ్య విభేదాలే కారణమని పార్టీ నాయకులతో పాటు కింది స్థాయి క్యాడర్ కూడా అభిప్రాయపడుతుంది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ లో పర్యటించి ఒకింత పార్టీలో జోష్ తెచ్చినా దానిని నిలబెట్టుకునే పరిస్థితుల్లో రాష్ట్ర నాయకులు లేరు. ఎవరికి వారు క్రెడిట్ తమకు దక్కాలన్న భావనలోనే ఉన్నారు. తమ నియోజకవర్గానికే పరిమితమవుతూ రాష్ట్ర స్థాయి సమస్యలపై కూడా స్పందించకపోవడం ఇందుకు ఉదాహరణగా చెప్పాలి.

**- బండి సంజయ్ కు అండగా..**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ అంశం పార్టీని ఒకింత డ్యామేజీ చేసింది. అయితే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుతో పాటు ఒకరో ఇద్దరు నేతలు మినహా మరెవరు సంజయ్ కు అండగా నిలబడలేదు. ఇందులో బండి సంజయ్ కి ఏం సంబంధమని ప్రశ్నించే వారు కూడా లేరు. పైగా సంజయ్ ఆ వివాదంలో చిక్కుకోవడంతో కొందరు లోలోపల సంతోషిస్తున్నారని ఆ పార్టీ సోషల్ మీడియాలోనే ట్రోల్ చేస్తుండటం విశేషం. ఇలాగే నేతల వైఖరి కొనసాగితే బీజేపీ తెలంగాణలో జరిగే ఏ ఎన్నికల్లోనూ విజయం సాధించడం, లేదా వచ్చే శాసనసభ ఎన్నికల్లో అధికారంలోకి రావడం అనేది జరగదన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా.

## కొబ్బరికాయలు అమ్ముతు నిరుద్యోగుల నిరసన

**వర్తక సంఘం రద్దు చేయాలనీ డిమాండ్...**



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట దేవస్థానంలో కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయాలని బుధవారం యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులు కొండపైన కొబ్బరికాయలు అమ్ముతూ నిరసన వ్యక్తం చేశారు. కొండపైన ఆలయ అభివృద్ధి సమయంలో కొండపైనే తొలగించిన దుకాణాలను వర్తక సంఘం పేరుతో ఏర్పాటు చేసుకొని కొన్ని సంవత్సరాలుగా టెండర్లు వేయకుండా రెన్యువల్ చేసుకుంటున్నారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా తిష్ట వేసుకొని కొండపైన దుకాణాలు కొనసాగిస్తూ వర్తక సంఘం పేరిట దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నారు. కొండపైన దుకాణాలను టెండర్లు వేస్తే 20 నుండి 30 కోట్ల రూపాయల ఆదాయం వస్తుందన్నారు. తక్షణమే వర్తక సంఘం పేరుతో నడుపుతున్న దుకాణాలను రద్దుచేసి టెండర్ల ద్వారా దుకాణాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

మన గుడి మన వ్యాపారం పేరుతో యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులు కొండపైన కొబ్బరికాయలు అమ్ముతూ నిరసనకు చేపట్టిన కమిటీ సభ్యులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ముందుగా ఉదయం కొందరిని పోలీసులు ముందస్తు అరెస్టు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు, ముక్కెర్ల వెంకటేష్,ముక్కెర్ల శ్రీకాంత్ చిన్నరాజు,ఆరేస్వామి,బండ రామస్వామి,దండ బోయిన వీరేష్ బండి వాసు పల్లపు బాలయ్య కర్రే ప్రవీణ్ బండి అనిల్ కొన్నే సంజీవ గుండ్లపల్లి లింగం,బండి అనిల్ బుగ్గ ఆంజనేయులు దొమ్మాట ప్రభాకర్, గోపగాని ప్రసాద్,స్వర్గం నరేష్,సుదగాని శివ,ఆవుల రాజు,ముక్కెర్ల నరసింహ, మందోజ్ నరేష్,కర్రె శ్యామ్, తదితరులున్నారు.

## నేరాల నియంత్రణే లక్ష్యం

**- ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ముమ్మర వాహన తనిఖీలు!**



చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, నేరస్థులను గుర్తించి పట్టుకోవడం, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీసులు జిల్లా వ్యాప్తంగా ముమ్మర వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు కీలక కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.నేరాల నివారణలో భాగంగా పోలీసులు అనుమానాస్పద కదలికలపై నిరంతర నిఘా ఉంచుతూ, అవసరమైతే వ్యక్తులను విచారించి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ముందుగానే అరికట్టే చర్యలు తీసుకుంటున్నారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేందుకు గస్తీ చర్యలను మరింత బలోపేతం చేశారు.

అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి జరిమానాలు విధిస్తూ, వారి ప్రాణ భద్రత కోసం హెల్మెట్ వినియోగం ఎంత ముఖ్యమో వివరిస్తున్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచిస్తున్నారు.ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ, శాంతియుత సమాజ నిర్మాణం సాధ్యమని ప్రకాశం జిల్లా పోలీసులు పేర్కొన్నారు.

## కిషోర్ బాలికల హెల్త్ క్యాంపునకు విశేష స్పందన



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా మేడ్చల్ జిల్లా ఎల్లంపేట్ పురపాలక సంఘ పరిధిలోని శ్రీరంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ లో నిర్వహించిన కిశోర బాలికలకు హెల్త్ క్యాంపు నకు విశేష స్పందన లభించింది. ఈ హెల్త్ క్యాంపులో లో పలు రకాల వైద్య పరీక్షలు (హిమోగ్లోబిన్ పరీక్షలు , ర్యాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షలు) నిర్వహించారు.పురపాలక సంఘం కమీషనర్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా ) ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ కమీషనర్ కృష్ణారెడ్డి బాలికలకు హెచ్ పీవీ వ్యాక్సిన్ పట్ల అవగాహన ఆవశ్యకత గురించి, ఇమ్యూనిటి పెంచుకొనుటకు తీసుకోవలసిన ఆహార అలవాట్లు గురించి వివరించారు. వైద్య పరీక్షల అనంతరం మందులు పంపిణి చేశారు ఈ కార్యక్రమములో ఎల్లంపేట మున్సిపల్ చైర్పర్సన్ శ్రీదేవి, మునిసిపల్ కమీషనర్ క్రిష్ణారెడ్డి వైస్ ఛైర్ పర్సన్ రజిత కౌన్సిలర్లు మహమ్మద్ ఆరిఫ్ ముత్యాలు గౌడ్ నాది వేణుగోపాల్ గౌడ్ రజిత , నిశిత రెడ్డి, నర్సింహా, ఓం ప్రకాష్ , వరలక్ష్మి, మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ నరేష్ , మెప్మా ఆర్పీలు, మెడికల్ ఆఫీసర్ ప్రతిభ మెప్మా అధికారి పద్మ మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకట రమణ రెడ్డి 126 మంది కిశోర బాలికలు పాల్గొన్నారు.


## అంబేద్కర్ సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గంట శంకరయ్యకు ఘన నివాళి



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) కీర్తి శేషులు గంట శంకరయ్య 5 వ వర్ధంతి సందర్భంగా బుధవారం గజ్వేల్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ సంఘము, ప్రజా సంఘాల ఆధ్యర్యంలో గంట శంకరయ్య చిత్ర పటానికి పూల మాలతో ఘనమైన నివాళి అర్పించారు వారు మాట్లాడుతూ గజ్వేల్ లో అంబేద్కర్ సంఘము నెలకొల్పి అట్టి సంఘం అధ్యక్షులు ఉండి అంబేద్కర్ సంఘము ఆధార్యములో గ్రామ గ్రామ తిరుగుతూ దళితుల కోసము సంక్షేమమే కోసము అలుపెరగని పోరాటము చేసిన వ్యక్తి గంట శంకరయ్య అని వారి ఆశయాలను కొనసాగిస్తారు అని తెలుపడం జరిగింది ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు అట్టుకూరి రాములు, ప్రధాన కార్యదర్శి మస్కూరి కిష్టయ్య, మన్నే కృష్ణ ,బొల్లారం ఎల్లయ్య,పంబాల సత్యనారాయ, పొట్ట యాదగిరి, మంచపురం బాల్ నర్సయ్య, మైసా మల్లయ్య, తుమ్మ శ్రీనివాస్, బైరము శివకుమార్ , మైసా నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## నెంటూర్ లో ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎఫ్ డీ సి మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూరు గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న ఎఫ్ డి సి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దమ్మతల్లి అనుగ్రహంతో అందరూ బాగుండాలని, వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించి అమ్మ దయతో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నెంటూర్ పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ అధ్యక్షులు నీరుడి నాగరాజు, ఉపాధ్యక్షులు లింగ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి లింగ ప్రశాంత్, సలహాదారులు కనకరాజు, మరియు ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న నిందితుడు అరెస్ట్

**- రిమాండ్ కి తరలింపునిందితుని వద్ద నుండి ఒక కిలో గంజాయి స్వాధీనం**
**- నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్**

విశ్వసనీయ సమాచారంతో ఖానాపూర్ మండలం రామరెడ్డిపల్లి బస్ స్టాప్ సమీపంలో ఆకస్మిక దాడి నిర్వహించి,బీహార్ రాష్ట్రానికి చెందిన మనీష్ పాస్వాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగింది.నిందితుడి వద్ద నుండి ఒక కిలో (లక్ష రూపాయల విలువ) గల గంజాయి,ఒక రియల్మీ మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకోవడం జరిగింది.విచారణలో నిందితుడు బీహార్ రాష్ట్రం నుండి గంజాయి తీసుకువచ్చి ఖానాపూర్ ప్రాంతంలో చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు.ఈ దాడిని, స్వాధీనం,విచారణ ప్రక్రియ మొత్తం కూడా ఈ-సాక్ష్య యాప్ ద్వారా వీడియో చిత్రీకరణ చేయడం జరిగింది.నిందితుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.మాదకద్రవ్యాల వ్యాపారం, సరఫరా,గంజాయి సాగుపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఈ కేసును విజయవంతంగా ఛేదించిన నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ అజయ్, ఎస్ఐ రాహుల్, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు

# చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

**రైతులు అధైర్య పడొద్దు.. మధ్యవర్తులను ఆశ్రయించవద్దు**

**27,600 మంది రైతులకు 286,60 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లో జమ**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) రైతుల నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, రైతులు అధైర్య పడొద్దు అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ రైతులకు సూచించారు.బుధవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి అదనపు కలెక్టర్ నగేష్,సివిల్ సప్లై అధికారులు, ఆర్డీవో లు, తహసిల్దార్ లు వ్యవసాయ శాఖ అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..రైతుల వద్ద నుంచి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, రైతులు అధైర్య పడొద్దు అని ,జిల్లాలో గతం కంటే అత్యంత వేగంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఎలాంటి అక్రమాలు లేకుండా పారదర్శకంగా రైతుల నుంచి ఈరోజు వరకు 200,602.200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 39,541 రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి, 27,600 మంది రైతులకు 286,60 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత స్పీడ్ అప్ చేసి, అకాల వర్షాల నుండి కాపాడడానికి టర్పాలీను కవర్లను అందుబాటులో ఉంచాలని, మిల్లర్లు అన్లోడింగ్ ప్రక్రియను సైతం త్వరిత గతిన చేపట్టాలనీ అధికారులను ఆదేశించారు.రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

# సెన్సస్ విధుల నుంచి తిరిగి వస్తున్న ఉపాధ్యాయుడికి రోడ్డు ప్రమాదం

**– హెల్మెట్ తో తప్పిన ప్రాణాపాయం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలో బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న పెరుక వెంకటేశ్వర్ రావు ప్రభుత్వం చేపట్టిన జనగణన కార్యక్రమంలో భాగంగా సర్కిల్ నెంబర్–12లో ఎన్యూమరేషన్ విధులు నిర్వహించి కరీంనగర్‌కు వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. బోయినిపల్లి మండలంలోని కొదురుపాక రూసో కాలేజీ సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. హెల్మెట్ ధరించి ఉండటంతో తలకు పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

# రిషితశ్రీ నూతన వస్త్రాలంకరణ వేడుకలో ఎమ్మెల్యే సత్యం హాజరు - ఆశీస్సులు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, మల్కాపూర్ గ్రామానికి చెందిన మడ్లపెల్లి సతీష్ – స్రవంతి దంపతుల కూతురు రిషితశ్రీ నూతన వస్త్రాలంకరణ వేడుకకు బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం హాజరై, చిన్నారికి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ గ్రామ సర్పంచ్ మడ్లపల్లి తులసి – గంగయ్య దంపతులు, బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సువీన్ యాదవ్, మాజీ మండలాధ్యక్షులు వెన్నెల రమణారెడ్డి,కోరెపు నరేష్, అమిరిశెట్టి భూమిరెడ్డి,తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు 50% రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ ప్రారంభం

**– తూముకుంట నర్సారెడ్డి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్‌లో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట (జనుము జీలుగు) ఎరువుల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పాల్గొని రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు భూమి సారాన్ని పెంచడంతో పాటు రైతులకు దిగుబడులు మెరుగుపడటానికి ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దూరి మల్లారెడ్డి, చెన్నారెడ్డి నరసింహారెడ్డి, నక్క రాములు గౌడ్, నాయిని యాదగిరి, గుంటుక శ్రీనివాస్, మొనగారి రాజు, సమీర్, నక్క రేగొండ గౌడ్, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ మతిన్, గాజుల శ్రీనివాస్, జహీర్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# చోరీ సొత్తుతో వెళ్తుండగా పోలీసులకు చిక్కిన నిందితుడి అరెస్టు

**– చందుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ : రవీందర్**






చందుర్తి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, చందుర్తి సర్కిల్ పరిధిలో వరుస దేవాలయ దొంగతనాలకు పాల్పడుతున్న కొనరావుపేట మండలం, పల్లిమక్త గ్రామానికి చెందిన మోకినపల్లి బాబు(36)ను బుధవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై ఏడు కేసులు నమోదైనట్లు చందుర్తి సీఐ రవీందర్ తెలిపారు. సుద్దాల ఎల్లమ్మ, కొలనూరు ఎల్లమ్మ, నిజామాబాద్ పెద్దమ్మ, కొండాపూర్ పెద్దమ్మ, భూక్యారెడ్డి తండా జగదాంబ, రామన్నపేట దాసాంజనేయ, రుద్రంగి మడేలయ్య దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. పల్లిమక్త గ్రామ శివారులో వాహనాల తనిఖీల సమయంలో పరారయ్యే ప్రయత్నం చేసిన మోకినపల్లి బాబును అదుపులోకి తీసుకొని, బంగారు పుస్తెలు, వెండి కళ్ళు, రూ.2 వేల నగదు, కార్ జాకీ, రెండు స్పీకర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కొనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి, కానిస్టేబుళ్లు విశాల్, జగన్, నాగరాజు కీలకంగా వ్యవహరించగా, వారిని సీఐ రవీందర్ అభినందించారు.

# ఆన్ లైన్ విక్రయాలకు వ్యతిరేకంగా మెడికల్ షాపుల బంద్




నాచారం(ప్రశ్న న్యూస్) ఆన్లైన్ మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ, కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ కు ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ పిలుపునిచ్చిన నేపథ్యంలో హబ్సిగూడ, నాచారం, తార్నాక ప్రాంతాలలో మెడికల్ షాప్ ల బంద్ కొనసాగుతోంది. హబ్సిగూడ – నాచారం కెమిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికల్ షాప్ ల నిర్వహకులు హబ్సిగూడ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం హబ్సిగూడ, నాచారం ప్రాంతాల్లో ఓపెన్ చేసి ఉంచిన మెడికల్ షాప్ వద్ద నిరసన వ్యక్తం చేసి షాప్ లను బంద్ చేయించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు, రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ లు మాట్లాడుతూ ఆన్లైన్ ఫార్మసీలు ఎటువంటి భౌతిక పరిశీలన లేకుండా, నకిలీ ప్రిస్క్రిప్షన్లతో యాంటీబయాటిక్స్, మత్తు కలిగించే ప్రమాదకరమైనమందులను విక్రయిస్తూ ప్రజా ఆరోగ్యానికి ముప్పుగామారుతున్నాయని ఆరోపించారు. కరోనా మహమ్మారి సమయంలో మందులను హోమ్‌డెలివరీ కోసం కేంద్రం తాత్కాలికంగా తెచ్చిన ఆన్ లైన్ డెలివరీ మినహాయింపు ఇప్పటికీ కొనసాగించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారంమందుల ను విక్రయించకుండా కొన్నిఫార్మసీలు భారీ డిస్కౌంట్లుఇస్తూ చిన్న వ్యాపారుల పొట్టకొడుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిబంధనలో మార్పులు సుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ– నాచారం కెమిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# యోగ నిర్వహకులను అభినందించిన డాక్టర్ సుభాష్ చంద్రబోస్

**ఆరోగ్యానికి యోగ ఎంతో అవసరం : డాక్టర్ బోస్**

**14వ వార్డులో కొనసాగుతున్న ఉచిత పతంజలి యోగ శిబిరం**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 14వ వార్డు భారత్ నగర్‌లో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత పతంజలి యోగ శిబిరాన్ని ఫైలేరియా ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ సుభాష్ చంద్రబోస్ సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా యోగ శిక్షకురాలు దేవసాని అనిత, నిర్వాహకులు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్‌లను ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం మాట్లాడిన డాక్టర్ సుభాష్ చంద్రబోస్... ప్రతి ఒక్కరూ యోగను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగ ద్వారా శ్వాసకోశ సమస్యలు, థైరాయిడ్, షుగర్, బీపీ వంటి అనారోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చన్నారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు తమ ఆసుపత్రిలో మందులతో పాటు కొన్ని ప్రత్యేక యోగాసనాల ద్వారా కూడా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. పిల్లలు, పెద్దలు ప్రతిరోజూ యోగ చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, "ఆరోగ్యమే మహాభాగ్యం" అని పేర్కొన్నారు. అనంతరం కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ... తమ విలువైన సమయాన్ని వెచ్చించి వార్డులో ఉచితంగా యోగ శిక్షణ అందిస్తున్న గురుజీ అనిత, గురుజీ నాగభూషణం, డాక్టర్ సుభాష్ చంద్రబోస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగ గురుజీ నాగభూషణం, సరస్వతి, విజయలక్ష్మి సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్ర పోచమ్మ తల్లి ఆశీస్సులతో నూతన బోరు విజయవంతం



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మేజర్ గ్రామంలోని జై భీమ్ నగర్ వాసులు నిర్మించుకున్న నూతన ఎర్ర పోచమ్మ గుడి వద్ద తాగునీటి అవసరాల కోసం నూతన బోరు వేయించగా విజయవంతంగా నీళ్లు పడటం ఆనందాన్ని నింపింది. స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు ఇమ్మడి శివలక్ష్మి -- జహంగీర్ దంపతులు స్పందించి బోరు వేయించగా, ఎర్ర పోచమ్మ తల్లి దయవల్ల సమృద్ధిగా నీరు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఇమ్మడి శివలక్ష్మి -- జహంగీర్ గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే నరారెడ్డి పాల్గొని భూమి పూజ నిర్వహించారు. అలాగే ఎఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, నెంటూరు రంగారెడ్డి, వంటిమామిడి మార్కెట్ చైర్మన్ మోహన్, జగదేవపూర్ పట్టణ కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెడికల్ షాపుల బంద్ సక్సెస్

**ఆన్ లైన్ లో మెడిసిన్ అమ్మడాన్ని నిషేధించాలని డిమాండ్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఆన్ లైన్ లో మెడిసిన్స్ ను అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన మెడికల్ షాపుల బంద్ విజయవంతం అయింది. ఆన్ లైన్ లో మెడిసిన్స్ అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం మెడికల్ షాపులను బంద్ చేశారు. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు షిండే ప్రధాన కార్యదర్శి రాజీవ్ సింఘాల్టి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ ను పాటించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు మెడికల్ షాపులను బంద్ చేసి ఉంచారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆన్ లైన్ లో మందులు కొనే విధానాన్ని రద్దు చేయాలని, నేరుగా మెడికల్ షాప్ కు వచ్చి మందులను కొనే పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్ లైన్ లో మందులు కొనే విధానం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని డాక్టర్ ప్రిస్క్రిప్షన్ చూపించి మందులను తీసుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలని వారు కోరారు.

# పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి : తోగుట సిఐ లతీఫ్



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)ఎండాకాలం సెలవుల సందర్భంగా చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ లతీఫ్ తోగుట సూచించారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో పిల్లలు ఎక్కువ సమయం ఇంటి వద్ద గడుపుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో చెరువులు, గుంటలు, కాలువల వద్దకు వెళ్లే సమయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఈత కొట్టేటప్పుడు తగిన పర్యవేక్షణ అవసరమని అన్నారు. అలాగే ఇంటి వద్ద ఉన్నప్పుడు పిల్లలు మొబైల్ ఫోన్లు, యాప్‌ల వినియోగంలో కూడా జాగ్రత్తగా ఉండేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలలో గుర్తు తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని మోసపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఏమి చేస్తున్నారు అనే విషయాలపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని అన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వారికి సరైన మార్గదర్శనం చేయాలని సీఐ తోగుట తెలిపారు.

# పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట పట్టణ మహిళ విభాగం మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్ళెం స్వాతి అత్త ఇటీవల అనారోగ్యానికి గురైనా విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థులను గొంగిడి సునీత తెలుసుకున్నారు. యాదగిరిగుట్ట పట్టణం కి చెందిన యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన గడ్డం చంద్రం గౌడ్ తల్లి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి సంతాపం తెలియజేసిన ఆలేరు మాజీ ప్రభుత్వ విప్, గొంగిడి సునిత మహేందర్ రెడ్డి

# చిక్కుల్లో 'ధురంధర్ 2'..

## కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు!



బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించిన బాలీవుడ్ భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' చుట్టూ ఇప్పుడు చట్టపరమైన వివాదం ముసురుకుంది. ఈ సినిమాలో సాయుధ దళాల రహస్యాలను, వారి కార్యకలాపాలకు సంబంధించిన సున్నితమైన వివరాలను బహిర్గతం చేశారని, దీనివల్ల దేశ భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉందంటూ ఢిల్లీ హైకోర్టులో ఒక ప్రజాహిత వ్యాజ్యం (PIL) దాఖలైంది. సశస్త్ర సీమా బల్ (SSB) విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దీపక్ కుమార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే బుధవారం ఈ కేసుపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. సినిమా అనేది కల్పిత కథ ఆధారంగా తెరకెక్కినప్పటికీ.. దేశ భద్రతా దళాల్లో పనిచేస్తున్న సిబ్బంది వ్యక్తం చేసిన ఆందోళనలను, అభ్యంతరాలను అంత తేలికగా తీసిపారేయలేం. ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC)ను న్యాయస్థానం ఆదేశించింది. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా, దర్శకుడు ఆదిత్యధర్ కాంబినేషన్‌లో స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన 'ధురంధర్ 2' గత మార్చి నెలలో విడుదలై సంచలన విజయం సాధించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ. 1800 కోట్లకు పైగా వసూళ్లను సాధించి రికార్డు సృష్టించింది.

ప్రస్తుతం విదేశాల్లో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రం, భారతీయ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఇండియాలో ఈ సినిమా జూన్ 4 నుంచి 'జియో హాట్‌స్టార్' వేదికగా డిజిటల్ స్ట్రీమింగ్ కానుంది.

# ఇక తమిళం వంతు!



దక్షిణాది సంస్కృతి, సినిమాలు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తుంది అగ్ర కథానాయిక జాన్వీకపూర్. తన తల్లి, లెజెండరీ నటి శ్రీదేవి తరహాలోనే ఇక్కడి ప్రేక్షకుల అభిమానాన్ని పొందాలన్నది తన లక్ష్యమని పలు సందర్భాల్లో చెప్పిందీ భామ. తెలుగు అరంగేట్ర చిత్రం 'దేవర'తో యువ హృదయాల్ని దోచుకున్న ఈ సొగసరి 'పెద్ది' చిత్రంతో త్వరలో ప్రేక్షకుల్ని పలకరించబోతున్న విషయం తెలిసిందే. ఇదిలావుండగా దక్షిణాదిలో తన మార్కెట్‌ను మరింత విస్తృతం చేసుకునే దిశగా జాన్వీకపూర్ అడుగులు వేస్తున్నది. ఈ నేపథ్యంలో ఆమె తమిళ సినీరంగంలో ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. అగ్ర నటుడు విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్ హీరోగా దర్శకుడు అరవింద్ కుమార్ ఓ న్యూఏజ్ లవ్‌స్టోరీని తెరకెక్కించబోతున్నాడు.

ఇందులో జాన్వీకపూర్ కథానాయికగా ఖరారైందని సమాచారం. కథలోని కొత్తదనం, తన పాత్ర తీరుతెన్నులు నచ్చడంతో కోలీవుడ్ అరంగేట్రానికి ఇదే సరైన చిత్రమని ఆమె భావిస్తున్నదట. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. 'పెద్ది' చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ తమిళంలో ఈ సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. 'పెద్ది'లో అచ్చియమ్మగా తన అందచందాలు, అభినయంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నదిజాన్వీకపూర్.

## ఆసుపత్రి వద్ద కెమెరాలు చూసి

# చిర్రెత్తిపోయిన సల్మాన్ ఖాన్

బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ పాపరాజీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ముంబైలోని ఓ ఆసుపత్రి వద్ద తనను చుట్టుముట్టిన ఫొటోగ్రాఫర్ల తీరుపై మండిపడ్డాడు. 'మీకు పిచ్చెక్కిందా?' (పాగల్ హో క్యా?) అంటూ సీరియస్ అయ్యాడు. ఈ ఘటన మంగళవారం ముంబైలోని మహిమ్ ప్రాంతంలో ఉన్న హిందూజా ఆసుపత్రి వద్ద చోటుచేసుకుంది.(ఆసుపత్రి నుంచి బయటకు వస్తున్న సల్మాన్‌ను ఫొటోగ్రాఫర్లు చుట్టుముట్టారు. ఆయన తన కారు వైపు వెళ్తుండగా ఒక్కసారిగా ఆగి వెనక్కి తిరిగి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. పద్ధతిగా ప్రవర్తించాలని హెచ్చరించాడు. సల్మాన్ తీవ్ర స్వరంతో మాట్లాడటంతో ఫొటోగ్రాఫర్లు వెంటనే క్షమాపణలు చెప్పి వీడియో తీయడం ఆపేశారు. అయితే, సల్మాన్ ఖాన్ ఎవరిని పరామర్శించడానికి ఆసుపత్రికి వెళ్లారనే విషయంపై స్పష్టత రాలేదు. కాగా, తాను ఒంటరిగా ఉన్నానంటూ వస్తున్న వార్తలపై సల్మాన్ ఇటీవల స్పందించిన విషయం తెలిసిందే. తనకు పెద్ద కుటుంబం, స్నేహితులు ఉన్నారని, తాను ఒంటరిని కాదని స్పష్టం చేశాడు. కొన్నిసార్లు ఎక్కువ మందితో ఉండి తన సోషల్ బ్యాటరీ అయిపోతుందని, అందుకే కొంత 'మీ టైమ్' తీసుకుంటానని తన ఎక్స్ ఖాతాలో వివరించాడు. ఈ నేపథ్యంలోనే ఆయన పాపరాజీపై అసహనం వ్యక్తం చేసి ఉండవచ్చని భావిస్తున్నారు.



# నటనకు భాష ముఖ్యం



మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సేకి సరైన విజయాలు లేకపోయినా.. సరైన అవకాశాలు మాత్రం తలుపుతడుతూనేవున్నాయి. తమిళంలో శివకార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న 'సెయాన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలోని తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడింది. 'ఈ సినిమాలోని నా పాత్ర గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. అయితే.. ఈ కథలో నా పాత్ర కీలకమని మాత్రం చెప్పగలను. నన్ను ఉత్తమనటిగా ప్రేక్షకుల ముందు నిలబెట్టే పాత్ర ఇది. అందులో సందేహం లేదు. ఏదైనా పాత్ర చేస్తున్నప్పుడు ఆ పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భాష చాలా ముఖ్యం. కథలోని భావోద్వేగాలను అర్థం చేసుకోకుండా నటిస్తే, అది నిరర్థకమే. అందుకే.. నిజాయితీగా ముందు భాష తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'కింగ్‌డమ్' సినిమా నటించేటప్పుడు నా పాత్ర కోసం తెలుగు నేర్చుకొని, డబ్బింగ్ కూడా నేనే చెప్పుకున్నా. అదే విధంగా త్వరలో 'సెయాన్' కోసం తమిళం నేర్చుకొని, నా పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతా' అని పేర్కొన్నది భాగ్యశ్రీ బోర్సే.

## దేశభక్తి అంశాలతో

# ఆర్‌కే దీక్ష

స్వీయ దర్శకత్వంలో ప్రతాని రామకృష్ణ గౌడ్ రూపొందించిన చిత్రం 'ఆర్‌కే దీక్ష'. కిరణ్, ఆక్సఖాన్, అలేఖ్య ప్రధాన పాత్రల్లో నటించారు. జూన్ 12న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం దర్శకనిర్మాత ఆర్.కె.గౌడ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం టీజర్‌తో పాటు పాటలను విడుదల చేశారు. అకుంఠిత దీక్షతో ఏదైనా కార్యాన్ని సంకల్పిస్తే విజయం తథ్యమనే సందేశాన్ని అందించే చిత్రమిదని, వీర జవాన్ మురళీనాయక్ గొప్పతనాన్ని తెలియజేసేలా ఓ ప్రత్యేకమైన పాటను రూపొందించామని, సందేశం ప్రధానంగా ఈ సినిమా మెప్పిస్తుందని ఆర్.కె.గౌడ్ తెలిపారు. మంచి కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించారని సీనియర్ నటుడు సుమన్ ప్రశంసించారు. సైనికుల ధైర్యసాహసాలను ఆవిష్కరించే ఓ పాట సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని నటి తులసి చెప్పింది. ఈ చిత్రానికి సంగీతం: రాజ్‌కిరణ్, సమర్పణ: డీఎస్ రెడ్డి, దర్శకత్వం, నిర్మాణం: ప్రతాని రామకృష్ణగౌడ్.



# 'సతీ లీలావతి' మూవీ రివ్యూ!



లావణ్య త్రిపాఠి ప్రధానమైన పాత్రను పోషించిన సినిమా 'సతీ లీలావతి'. రొమాంటిక్ కామెడీ జోనర్లో రూపొందిన ఈ సినిమాకి తాతినేని సత్య దర్శకత్వం వహించాడు. 'శాకుంతలం' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన దేవ్ మోహన్, ఈ సినిమాలో లావణ్య త్రిపాఠికి జోడీగా నటించాడు. ఈ నెల 8వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, నెల తిరక్కుండానే ఓటీటీకి వచ్చేసింది. ఈ రోజు (మే 20వ తేదీ) నుంచి 'జియో హాట్ స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది.

లీలావతి (లావణ్య త్రిపాఠి) ఓ సినిమా డైరెక్టర్. ఆమెతో ఓ సినిమా చేయాలని చాలామంది నిర్మాతలు వెయిట్ చేస్తుంటారు. ఆమె భర్త సేతుపతి ( దేవ్ మోహన్) ఓ సైకాలజిస్ట్. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల ( నరేశ్ - పవిత్ర) పోట్లాటలు చూస్తూ పెరిగిన కారణంగా ఆమె మానసికంగా దెబ్బతింటుంది. ఆ సమస్య నుంచి బయటపడటానికి సాయం చేసిన సేతుపతినే వివాహం చేసుకుంటుంది. అయితే పూర్తిగా కెరియర్ పై ఫోకస్ చేసిన ఆమె, సేతుపతిని నిర్లక్ష్యం చేస్తుంది. లీలావతి ప్రవర్తనకి తాను విసిగిపోయినట్టుగా ఆమెతో సేతుపతి చెబుతాడు. తాను నికోలా సెబాస్టియన్ (మడోన్నా సెబాస్టియన్) అనే యువతిని ప్రేమించినట్టుగా చెబుతాడు. ఇకపై ఆమెతోనే జీవించాలనే నిర్ణయానికి వచ్చానని అంటాడు. తనకి విడాకులు ఇవ్వమని కోరుతూ లాయర్ ను కూడా ఇంటికి పిలిపిస్తాడు. అందుకు సంబంధించిన కాగితాలపై సంతకం చేయమని అంటాడు. తనని సేతుపతి ప్రేమించి పెళ్లి చేసుకోలేదనీ, తన తండ్రి అతనిని ఒప్పించాడనే విషయం లీలావతికి అప్పుడే అర్థమవుతుంది. సేతుపతి నిర్ణయం పట్ల ఆగ్రహావేశాలకు లోనైన లీలావతి, అతనిని ఇంట్లోనే బంధిస్తుంది. లీలావతి తండ్రి .. లీలావతితో సినిమా తీయాలనుకుంటున్న మొట్ట రాజన్ .. సేతుపతి పిలిపించిన లాయర్ .. సేతుపతి ప్రేమించిన నికోలా అక్కడికి చేరుకుంటారు.

అప్పుడు లీలావతి ఏం చేస్తుంది? పర్యవసానంగా చోటుచేసుకునే సన్నివేశాలు ఎలాంటివి? అనేది కథ. 'సతీ లీలావతి' అనే పేరు వినగానే, అందుకు పూర్తి రివర్స్ గేర్ లో కథ వెళుతుందని ప్రేక్షకులు ముందుగానే గ్రహిస్తారు. భార్య భర్తల కీచులాటలోని ఎంటర్టైన్ మెంట్ ను ఎంజాయ్ చేయడానికి సిద్ధపడతారు. వాళ్లంతా ఆశించినట్టుగానే, 'నాకు విడాకులు కావాలి' అని భార్యను భర్త ఒత్తిడి చేయడంతో అసలు కథ మొదలవుతుంది. అతను ఆ నిర్ణయం తీసుకోవడానికి కారణం మరో స్త్రీ అని లీలావతికి తెలిసేలా చేస్తూ దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు.అసలు ఈ ఇద్దరికీ ఎలా పరిచయమైంది .. ఆ పరిచయం పెళ్లి పీటల వరకూ ఎలా వచ్చింది? అనేది ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ లో భాగంగా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. భార్యాభర్తలలో ఎవరో ఒకరు దూరం పెడుతున్నారని అనిపించినప్పుడో .. దూరంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చినపుడో విడాకుల ప్రస్తావన వస్తుంది. విడాకుల ప్రస్తావన ఆ గొడవ మరింత ముదరడానికి కారణమవుతుందనేది ఈ జంట విషయంలోను చూపించారు. కాకపోతే కామెడీ టచ్ ఇచ్చారు. నాకు విడాకులు కావాలని భర్త అంటాడు. నేను ఇవ్వను పో అంటుంది భార్య. కథ మొత్తం ఈ లైన్ పైనే నడుస్తుంది. ఈ విషయంపై ఇంట్లోని నాలుగు గోడల మధ్య వాదనలు జరుగుతూ ఉంటాయి. మధ్య మధ్యలో ఫ్లాష్ బ్యాక్ లోకి వెళ్లి వస్తుంటారు. ఇంట్లో నుంచి మాత్రం బయటికి రారు. ఇక ఆ రెండు పాత్రలతో సంబంధం ఉన్న మరో నాలుగైదు పాత్రలు బయట కాచుకుని ఉంటాయి. లోపల ఏం జరుగుతుందనేది వాళ్లకి కూడా తెలియదు.సీనియర్ నరేశ్ .. మొట్ట రాజేంద్రన్ .. వీటీవీ గణేశ్ వలన కామెడీ వర్కౌట్ కాకపోవడంతో ఆడియన్స్ అసహనానికి లోనవుతారు. అదే సమయంలో సప్తగిరి ఎంట్రీ ఇస్తాడు. హమ్మయ్య కాసేపు నవ్వుకోవచ్చని ప్రేక్షకులు అనుకుంటే, అతను తనకి తోచినట్టుగా ఏకపాత్రాభినయం చేసి వెళ్లిపోతాడు. ఇదంతా చూస్తున్నప్పుడు ఆడియన్స్ కి ఒక సందేహం మాత్రం కలగకుండా ఉండదు. అసలు ఈ సినిమాకి స్క్రిప్ట్ ఉందా లేదా? అని.హారర్ కథల మాదిరిగా ఈ కథేమిటబ్బా గుమ్మం దాటి బయటికి రావడం లేదని ప్రేక్షకులకు చిరాకు పడుతూ ఉండగా, ప్రధానమైన పాత్రల మధ్య ఛేజింగ్ మొదలవుతుంది. కొండపై ఒక పెద్ద సెటప్ .. క్లైమాక్స్ అక్కడే కావడంతో అంతా అక్కడికి చేరుకుంటారు. ఈ ఎపిసోడ్ చూస్తుంటే, మనకు కార్టూన్ షో గానీ .. వీడియో గేమ్ గాని గుర్తుకు రాకుండా ఉండదు

.హీరోయిన్ ను చిన్నప్పటి నుంచి లవ్ చేసే మరుగుజ్జు, వాష్ రూమ్ కి వెళ్లాలంటూ చేసే హడావిడి, ఐస్ క్రీమ్ - గులాబీ జామ్ అంటూ హీరోయిన్ చెప్పే కథలు .. 'స్వాతిముత్యం'లో కమల్ హాసన్ కంటే అమాయకంగా కనిపించే సైకాలజిస్ట్ పాత్ర .. ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తాయి. విషయం లేకుండా నవ్వించడానికి వాళ్లు ఎంత కష్టపడ్డారో .. నవ్వురాక ఆడియన్స్ కూడా అంతే ఇబ్బంది పడతారని చెప్పాలి. కథాకథనాలు మాత్రమే కాదు, సన్నివేశాలు .. సంభాషణలు కూడా అంతే పేలవంగా అనిపిస్తాయి. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరి కేటగిరీలోనే కనిపిస్తాయి. బలహీనమైన కథను బలమంతా ఉపయోగించిలాగినా ఎలాంటి ప్రయోజనం ఉండదు. అదే విషయాన్ని మరోసారి నిరూపించిన కంటెంట్ ఇది.

## బోయినిపల్లి తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్

-ఈఏపీసెట్ - 2026 లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యాసంస్థ

- ఇంటర్ అడ్మిషన్లకు ఈనెల 25 వరకు దరఖాస్తులు ఆహ్వానం

- మోడల్ స్కూల్/కళాశాల ప్రిన్సిపాల్ : ఎరువ రఘునాథ్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్,జూనియర్ కాలేజీలో 2026–27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఈఏపీసెట్–2026 ఫలితాల్లో ఈ విద్యాసంస్థ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని, ఇంటర్ మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంక్ సాధించడం గర్వకారణమన్నారు.దరఖాస్తులు మే 13 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారని తెలిపారు. విద్యార్థులు సంబంధిత వెబ్సైట్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా మే 27న విడుదల చేయగా, మే 28 నుంచి 30 వరకు ప్రవేశ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఏసీఈ గ్రూపుల్లో ఒక్కో విభాగంలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌తో పాటు జేఈఈ, ఈఏపీసెట్, నీట్ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించనున్నట్లు వెల్లడించారు. బాలికలకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ రఘునాథ్ కోరారు.

## వేములవాడ లో డ్రగ్స్,గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు

- నార్కోటిక్ జాగిలంతో పోలీసుల విస్తృత తనిఖీలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగులు, వస్తువులను పరిశీలించారు.మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని పోలీస్ అధికారులు తెలిపారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధురాలికి వృద్ధాశ్రమంలో ఆశ్రయం

- ఆపదలో ఉన్న వృద్ధులను ఆదుకోవడం సమాజ బాధ్యత

- అమ్మా అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకులు : గడ్డం తిరుమల - శ్రీనివాస్



వేములవాడ / భీంగల్ నిజామాబాద్ జిల్లా, భీంగల్ పట్టణంలోని బోయిగల్లీకి చెందిన జంబూక రాజగంగా (62) జీవితం పై విరక్తితో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ధర్మగుండం వద్ద బుధవారం ఆవేదనతో ఆత్మహత్యకు ప్రయత్నించింది. అక్కడ విధుల్లో ఉన్న హోమ్ గార్డు పద్మ గమనించి వెంటనే స్థానిక "మై వేములవాడ చారిటేబుల్ ట్రస్ట్" సభ్యులు, పట్టణ పోలీసులకు సమాచారం అందించారు.వారి సమన్వయ సహకారంతో వృద్ధురాలిని కాపాడి,జిల్లాలోని తంగళ్లపల్లి మండలం,ఓబులపూర్ గ్రామంలోని "అమ్మా అనాథ వృద్ధాశ్రమం"లో నిర్వాహకులు గడ్డం తిరుమల--శ్రీనివాస్ దంపతుల సమక్షంలో ఆశ్రయం కల్పించారు.ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వాహకులు గడ్డం తిరుమల--శ్రీనివాస్ దంపతులు మాట్లాడుతూ, "ఆపదలో ఉన్న వృద్ధులను ఆదుకోవడం సమాజ బాధ్యత. రాజగంగాకు మా వృద్ధాశ్రమంలో అవసరమైన ఆశ్రయం,ఆహారం,వైద్య సహాయం అందిస్తాము. ఆమె మానసికంగా ధైర్యంగా ఉండేలా అన్ని విధాలుగా సహకరిస్తాం" అని తెలిపారు. సమయస్ఫూర్తితో స్పందించిన హోమ్ గార్డు పద్మ, "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్" సభ్యులు, పట్టణ పోలీసుల సేవలను పలువురు స్థానికులు అభినందించారు.

## జగిర్యాల్‌లో విలేజ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ప్రారంభం



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలంలోని జగిర్యాల్ గ్రామంలో సర్పంచ్ గడల ప్రసాద్, ఉప సర్పంచ్ చేగంటి భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు పోతునూరి శ్రీనివాస్ సౌజన్యంతో విలేజ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లను బుధవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గడల ప్రసాద్ మాట్లాడుతూ యువత చెడు ఆలోచనల వైపు మళ్లకుండా క్రీడల ద్వారా మంచి ఆలోచనా విధానం పెంపొందుతుందని తెలిపారు. గ్రామానికి చెందిన పది జట్లు ఈ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొంటున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోతునూరి శ్రీనివాస్,సంజీవ్,కళ్యాణ్, హరి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మందుల విక్రయాలకు నిరసనగా ఫార్మసీలు బంద్

- బోయినిపల్లిలో స్తంభించిన మెడికల్ షాపుల కార్యకలాపాలు

- కార్పొరేట్ ఈ- ఫార్మసీలతో ఉపాధి ప్రమాదంలో డ్రగ్గిస్ట్ లు

- నకిలీ ప్రెస్క్రిప్షన్లతో ప్రజారోగ్యానికి ముప్పు

- హోం డెలివరీ నిబంధనలను వెంటనే రద్దు చేయాలి

- డ్రగ్గిస్ట్స్ అండ్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ మండల సభ్యులు : బిల్ల సత్యం




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం మెడికల్ షాపులు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఆన్‌లైన్ మందుల విక్రయాలకు వ్యతిరేకంగా రాజన్న సిరిసిల్ల జిల్లా డ్రగ్గిస్ట్స్ అండ్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ ఇచ్చిన జిల్లా బంద్ పిలుపుకు ఫార్మసీ యజమానులు పూర్తి మద్దతు తెలిపారు.బుధవారం ఉదయం నుంచే మెడికల్ షాపులను మూసివేసి నిరసన తెలిపినట్లు అసోసియేషన్ బోయినిపల్లి మండల సభ్యుడు బిల్ల సత్యం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ కార్పొరేట్ సంస్థలు భారీ డిస్కౌంట్లతో మందులు విక్రయించడం వల్ల సంప్రదాయ ఫార్మసీల వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని, ఈ రంగంపై ఆధారపడిన లక్షలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా నకిలీ ప్రిస్క్రిప్షన్లు సృష్టించి యాంటీబయాటిక్స్, మత్తు మందులు ఆన్‌లైన్‌లో విక్రయించడం ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోందని హెచ్చరించారు. కోవిడ్ సమయంలో అమల్లోకి తెచ్చిన తాత్కాలిక హోమ్ డెలివరీ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## సున్నిపెంట భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు:కలెక్టర్ రాజకుమారి గణియా

రూ.10 కోట్లతో సున్నిపెంటలో రోడ్లు,

తాగునీటి అభివృద్ధి పనులు వేగవంతం



శ్రీశైలం(ప్రశ్న న్యూస్)శ్రీశైలం డ్యామ్ పరిసర ప్రాంతాల అభివృద్ధి, భూముల వినియోగం, ప్రభుత్వ ప్రణాళికలు ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ రాజకుమారి వెల్లడించారు. మంగళవారం సున్నిపెంటలో రూ.10 కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఆస్తులన్నీ ప్రజలకే చెందుతాయని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రోడ్లు, పాఠశాలలు, డ్రైనేజీలు, ఆసుపత్రులు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సున్నిపెంట ప్రాంతంలో మరిన్ని డ్రైనేజీలు, అంతర్గత రహదారుల అవసరం ఉన్నట్లు గుర్తించామని, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే అంచనాలు సిద్ధం చేసి, త్వరలోనే పరిపాలనా మంజూరులు పొందేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'జలహారతి' కార్యక్రమం సందర్భంగా శ్రీశైలం డ్యామ్ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు, స్థానిక ఎమ్మెల్యే ప్రాంత అభివృద్ధి అవసరాలు, రహదారుల పరిస్థితిని వివరించారని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ వెంకట శివ, పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

## జగన్మోహన్ రెడ్డి అరాచక, దుర్మార్గపు కుట్రలను ప్రజలంతా ఏకమై ఎదిరించాలి

- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

- జోగి కల్తీ మద్యం బాగోతం బయటపెట్టిన సిట్

రాజకీయ స్వార్థం కోసం ప్రజల ప్రాణాలతో

చెలగాటమాడుతున్న 'గొడ్డలి పార్టీ

గత వైసీపీ పాలనలో నాసిరకం

బ్రాండ్ల వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు



మంగళగిరి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో అలజడులు సృష్టించి, ప్రభుత్వంపై అపవాదు వేయడమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పన్నిన కల్తీ మద్యం కుట్రలు 'సిట్' దాఖలు చేసిన చార్జ్‌షీట్‌తో పూర్తిగా బట్టబయలయ్యాయని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వాన్ని ఏ రకంగానైనా అస్థిరపరచాలి, రాష్ట్రంలో ఎలాగైనా అలజడులు సృష్టించాలనే ఏకైక లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అత్యంత దారుణమైన కుట్రలకు తెరలేపారు. కేవలం రాజకీయ స్వార్థం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటానికి కూడా వెనుకాడరనడానికి ఈ ఘటనే సజీవ సాక్ష్యమని ఆయన మండిపడ్డారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొలకలచెరువు, ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో కల్తీ మద్యం తయారు చేసి, వాటిని దుకాణాలకు తరలించి ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేందుకు ప్రయత్నించిన కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ ప్రధాన నిందితుడిగా తేలారు.

## వర్షాకాలం లోపు డ్రైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి:కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ (ప్రశ్న న్యూస్)రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో చేపడుతున్న డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తిచేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా బందర్ రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్ రోడ్డు, కృష్ణవేణి స్కూల్ రోడ్డు, రామలింగేశ్వర నగర్ తదితర ప్రాంతాలను పర్యటించి జరుగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షపు నీరు రహదారులపై నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా కృష్ణవేణి స్కూల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ప్రతి వర్షాకాలంలో ఎదురయ్యే నీటి నిల్వ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఔట్‌ఫాల్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. ఈ పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి వర్షపు నీరు ఎటువంటి ఆటంకం లేకుండా సాఫీగా ప్రవహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యమని కమిషనర్ తెలిపారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, పనులు వేగంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. తదుపరి కమిషనర్ రామలింగేశ్వర నగర్ కట్ట రోడ్డు, బెంజ్ సర్కిల్ మీదుగా కనకదుర్గమ్మ వారధి వరకు పర్యటించి నగర సుందరీకరణ, హరితాభివృద్ధి పరిశీలించారు. నగరంలో హరితాన్ని మరింత పెంచి ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. ప్రధాన రహదారులు, డివైడర్లు, ఖాళీ ప్రదేశాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే. షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. సామ్రాజ్యం తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్

మెదక్ ఆర్డీవో రమాదేవి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ పై సమావేశం ఆర్డీవో కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు.క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకతతో పని చేయాలన్నారు.రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నారన్నారు. ఈ సమయంలో బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి, ఎన్యూమరేషన్ ఫారాల ద్వారా వివరాలు సేకరిస్తారన్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా, వారి పేరు, మొబైల్ నంబర్, పోలింగ్ కేంద్రం వివరాల గురించి చర్యలు తీసుకోవాలని, విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు.ఫారం–6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు.బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు.బీఎల్ఓలు పాస్వర్డ్ లను ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఆర్ అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్

పుష్కరాల ఏర్పాట్లపై కొవ్వూరు డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం

పార్కింగ్, ఘాట్లు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలపై ప్రత్యేక దృష్టి



కొవ్వూరు (ప్రశ్న న్యూస్ ) గోదావరి పుష్కరాలకు అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ సూచించారు.కొవ్వూరు ఆర్‌డీవో కార్యాలయంలో బుధవారం జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ ఆధ్వర్యంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో 20 పుష్కర ఘాట్లను గుర్తించినట్లు తెలిపారు. కొవ్వూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల సుమారు పది కిలోమీటర్ల పరిధిలో పార్కింగ్‌కు అనువైన ఖాళీ స్థలాలను గుర్తించి పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్‌డీవో కె. ఆనందరావు, డీఎస్పీ దేవకుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తాళ్లపూడి, కొవ్వూరు తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కీసర సర్కిల్‌లో 'అక్రమ' సామ్రాజ్యం

- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులదే 'పాడింది పాట.. ఆడింది ఆట
- టౌన్ ప్లానింగ్ అధికారుల నిమ్మకు నీరెత్తిన వైఖరి పట్టించుకోని డిప్యూటీ కమిషనర్
- కలెక్షన్ ఏజెంట్లుగా మారిన సిబ్బంది, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- అధికార పార్టీ నేతల అండతోనే అక్రమ నిర్మాణాలు.?






కీసర ( ప్రశ్న న్యూస్) కీసర మున్సిపల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కీసర, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, శామీర్‌పేట్ డివిజన్లలో ఎక్కడ చూసినా నిబంధనలకు విరుద్ధంగా భవనాలు, షెడ్లు, అదనపు అంతస్తుల నిర్మాణాలు ఏదేచ్ఛగా సాగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం, ఉన్నతాధికారుల ఉదాసీనత వల్లే ఇదంతా జరుగుతోందని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కొత్తగా విలీనమైన ఈ సర్కిల్‌ను మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఉన్నత అధికారులు అసలు పట్టించుకుంటున్నారా.? లేదా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేతుల్లో టౌన్ ప్లానింగ్

కీసర సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేతుల్లోకి వెళ్ళిపోయినట్లు స్థానిక ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన ఈ సిబ్బంది, అక్రమ నిర్మాణదారులకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. "మేమున్నాం.. చూసుకుంటాం" అంటూ ధైర్యం చెపుతూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన పన్నుల రూపంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

### ఆఫీస్‌కు రారు.. ఫోన్ ఎత్తరు: టి.పి.ఎస్.( స్రవంతి)పై ప్రజా ఆగ్రహం

కీసర సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగం ఎంత నిర్వీర్యమైందో చెప్పడానికి స్థానిక టి.పి.ఎస్ (టౌన్ ప్లానింగ్ అధికారిని) స్రవంతి తీరే నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. ఆమె వారంలో కనీసం మూడు రోజులు కూడా ఆఫీస్‌కు రారని, ఒకవేళ వచ్చినా ప్రజల సమస్యలను పట్టించుకోరని బాధితులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేయడానికి ఫోన్ చేసినా స్పందించరని, ఎప్పుడూ అందుబాటులో ఉండరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టి.పి.ఎస్ స్రవంతి స్వయంగా ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ప్రోత్సహిస్తున్నారా.? లేక సదరు సిబ్బందే ఈమెకు 'కలెక్షన్ ఏజెంట్లు'గా మారారా.? అనే అనుమానాలు ప్రజల నుండి క్షేత్రస్థాయిలో బలంగా వ్యక్తమవుతున్నాయి.

### స్పందించని డిప్యూటీ కమిషనర్..

అక్రమ నిర్మాణాలపై స్థానిక ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారుల నుంచి కనీస స్పందన కరువైందని స్థానికుల మండిపడుతున్నారు. సాక్షాత్ డిప్యూటీ కమిషనర్‌కు స్వయంగా ఫిర్యాదులు చేసినా, 'చూస్తాం.. పరిశీలిస్తాం' అనే కాలయాపన సమాధానాలే తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యమని డిప్యూటీ కమిషనర్ కూడా అక్రమార్కులతో చేతులు కలిపారా అన్న అనుమానాలను బాధితులు వ్యక్తపరుస్తున్నారు. అధికారులు ఇలా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

### అధికార పార్టీ నేతల అండదండలు.?

మరోవైపు ఈ అక్రమ నిర్మాణాల వెనుక స్థానిక అధికార పార్టీ నాయకుల హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "ఇది అధికార పార్టీ నాయకుడి భవనం, అటువైపు వెళ్ళకూడదు" అంటూ టౌన్ ప్లానింగ్ సిబ్బంది సైతం అటువైపు వెళ్ళడానికి జంకుతున్నట్లు సమాచారం. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు నేతలు చేస్తున్న ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతున్నారా.? లేక వారే కుమ్మక్కయ్యారా.? అనే కోణంలో చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడటానికి, గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రణాళికను కాపాడటానికి ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కీసర సర్కిల్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ జరపాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న టి.పి.ఎస్ స్రవంతిపై, అక్రమాలకు పాల్పడుతున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందిపై ఏసీబీ అధికారులచే విచారణ చేపించి కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# అభిషేక్ ఫిర్యాదు..ఎస్సై నందిత అరెస్టు

## -ఏసిబి డీఎస్పీ శ్రీధర్

- "30"వేల లంచంతో అడ్డంగా బుక్కయిన బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై నందిత
- కుటుంబంలో లొల్లీ, హత్యాయత్నం కేసు నమోదు ప్రతి రోజూ స్టేషన్లో సంతకం,
- "30"వేలు ఇస్తే పరిషాన్ ఖతం ఎస్సై నందిత.
- బతిమాలినా వినలే, బరితెగించిన "30"వేలు అడిగితే,ఏసిబిని ఆశ్రయించాను బాధితుడు: అభిషేక్
- ముప్పై వేల లంచంతో రెడ్ హ్యాండ్ గా పట్టుబడిన ఎస్సై.
- డబ్బుతో,స్కూటీ కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఏసిబి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారుల పై అవినీతి నిరోధక శాఖ అధికారులు దూకుడు పెంచారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఆరోపణలు అధికమవుతుండడంతో అనిశా ఆకస్మిక తనిఖీలు,వల పన్నీ కేసులతో ఏసిబి వరుసగా దాడులు నిర్వహిస్తున్న సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి.
మరీ ముఖ్యంగా పోలీస్ శాఖలోనే అధికారులు లంచాలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా దొరకడంచర్చనీయాంశంగా మారాయి.అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలు పెరిగిపోవడంతో ఆకస్మిక తనిఖీలు చేయడంతోపాటు ట్రాప్ కేసులతో అవినీతి నిరోధక శాఖ హడలెత్తిస్తోంది.ఈ నేపథ్యంలో నిన్న బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు మల్కాజిగిరి పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఉన్న మల్కాజిగిరి జోన్ బేగం పేట డివిజన్ బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్లో లంచం తీసుకుంటూ మహిళా ఎస్సై అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన ఘటన బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్తే: పాత బోయిన్ పల్లికి చెందిన అభిషేక్ అనే యువకుడు తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న నేపథ్యంలో కన్నతండ్రికి, కుమారుడు అభిషేక్ కు మధ్య తలెత్తిన విభేదాల నేపథ్యంలో ఆగ్రహావేశాలతో తండ్రి పై కుమారుడు దాడి చేశాడు.ఈ ఘటన పై బోయిన్ పల్లి పిఎస్ లో తండ్రి ఫిర్యాదు చేయగా పోలీసులు హత్యాయత్నం(బిఎన్ఎస్ యాక్ట్ :307)కింద కేసు నమోదు చేశారు.ఇదే కేసు విషయమై బోయిన్ పల్లి ఎస్సై నందిత నిందితుడు అభిషేక్ ను రిమాండ్ కు తరలించినట్లు ఏసీబీ డిఎస్పి శ్రీధర్ తెలిపారు.అనంతరం ఈ కేసులో భాగంగా ప్రతి సోమవారం పోలీస్ స్టేషన్ కు హాజరై సంతకం చేయాలని సూచించారు.సంతకం పెట్టేందుకు పోలీస్ స్టేషన్ కు వచ్చిన నిందితుడిని సంతకం తీసుకుని పంపాల్సిన అధికారులు, పంపకుండా రోజంతా ఠాణా లోనే కూర్చోబెట్టి ఇబ్బందులకు గురిచేసినట్లు అభిషేక్ తెలిపారు.పోలీస్ స్టేషన్ కు ప్రతి సోమవారం హాజరయ్యే విషయంలో ఉపశమనం కలిగిస్తానని చెప్పి రైటర్ విజయ్ మొదట పదివేల లంచం తీసుకున్నట్లు తేలింది.ఈ కేసులో ఎస్సై నందితకు 15వేల రూపాయలు ఇవ్వాలని రైటర్ విజయ్ చెప్పగా నిందితుడు ఎస్సైని సంప్రదించగా అందుకు అంగీకరించని ఎస్ఐ నందిత తనకు 30 వేల రూపాయలు కావాలని హుకుం జారీ చేసింది.ఈ పరిణామాలతో తీవ్రంగా విసిగిపోయిన నిందితుడు అభిషేక్ చేసేదేమీ లేక అవినీతి నిరోధక శాఖ అధికారులనుసంప్రదించాడు. ఫిర్యాదు అందుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి లంచం తీసుకున్న ఎస్సై నందితను రైటర్ విజయ్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని అదుపులోకి తీసుకొని విచారించారు.అలాగే పోలీస్ స్టేషన్ పార్కింగ్ ప్రాంగణంలో ఎస్సై నందితకు చెందిన ద్విచక్ర వాహనంలో 30 వేల రూపాయల నగదును, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాలలో పోలీస్ స్టేషన్లలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతే లంచం అడిగినట్లయితే ఏసిబి టోల్ ఫ్రీ నెంబర్ 1067 కు సమాచారం ఇవ్వాలని, అలాగే ఫిర్యాదు దారులు వివరాలు గోప్యంగా ఉంచుతామని డిఎస్పి శ్రీధర్ స్పష్టం చేశారు.

### రూపాయి విలువ పడిపోకుండా

# ఆర్బీఐ కీలక నిర్ణయం

- బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యత పెంచడానికి రూపాయి-డాలర్ బై




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత కరెన్సీ రూపాయి రోజురోజుకూ క్షీణిస్తోంది. రూపాయితో డాలర్ మారకం విలువ 96ను దాటి పడిపోయింది. దీంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రంగంలోకి దిగింది. ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్ వ్యవస్థలోకి నగదు లభ్యతను పెంచడానికి 5 బిలియన్ డాలర్ల విలువైన డాలరు – రూపాయి బై, సెల్ స్వాప్ వేలాన్ని చేపట్టనుంది.మే 26వ తేదీన వేలం ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో రూపాయి విలువ పతనమవుతోంది. దీంతో బై, సెల్ స్వాప్ వేలం నిర్ణయం తీసుకుంది. పరిస్థితులకు అనుగుణంగా మూడేళ్ల కాలపరిమితితో రూపాయి – డాలర్ బై, సెల్ స్వాప్ వేలాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆర్బీఐ తెలిపింది. మార్కెట్‌లో నగదు లభ్యతను పెంచడానికి ఆర్బీఐ బై, సెల్ స్వాప్ విధానాన్ని అనుసరిస్తుంటుంది. వాణిజ్య బ్యాంకులు తమ వద్ద ఉన్న డాలర్లను ఆర్బీఐకి విక్రయించి, దానికి సమానమైన రూపాయలను పొందడమే ఈ విధానం. మూడేళ్ల గడువు ముగిసిన తర్వాత అంతే మొత్తంలో డాలర్లను ముందే నిర్ణయించిన ప్రీమియం ధరతో తిరిగి కొనుగోలు చేయడానికి బ్యాంకులు ఒప్పందం చేసుకుంటాయి. ఈ విధానం ద్వారా బ్యాంకులకు నిధుల లభ్యత పెరుగుతుంది. మరోవైపు ఆర్బీఐ వద్ద విదేశీ మారకం నిల్వలు పెరుగుతాయి. అప్పుడు రూపాయి పతనం ఆగిపోతుంది.

# సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు

- 66 మందిని అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆపరేషన్ ఆక్టోబస్ 3.0లో భాగంగా సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు అందిస్తున్న 66 మందిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు 13 రాష్ట్రాల్లో దాడులు నిర్వహించారు. ఘోస్ట్ సిమ్ కార్డులతో దేశవ్యాప్తంగా ఎన్నో సైబర్ నేరాలు చేసినట్లు గుర్తించారు. పద్దెనిమిది బృందాలతో ఏడురోజుల పాటు ఈ ఆపరేషన్‌ను కొనసాగించగా, 1,194 ఘోస్ట్ సిమ్ కార్డులను గుర్తించి, వాటిలో 544 కార్డులను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. సైబర్ నేరగాళ్ళకు 20 మంది పీవోఎస్ ఏజెంట్లు సహకారం అందించినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 10 మంది వోడాఫోన్ ఐడియా, ఏడుగురు ఎయిర్‌టెల్, ముగ్గురు జియో పీవోఎస్ ఏజెంట్లను అరెస్టు చేశారు. సిమ్ కోసం వచ్చిన వారికి తెలియకుండా మరో సిమ్ యాక్టివేట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

# మెలోనికి "మెలోడి" సర్‌ప్రైజ్

## – మోదీ స్పెషల్ గిఫ్ట్




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి మోదీ ఇటలీ పర్యటన వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి భారత ప్రధాని మోదీ ప్రత్యేక గిఫ్ట్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోను మెలోని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. "థాంక్యూ ఫర్ ది గిఫ్ట్" అని మెలోని పేర్కొన్నారు. ఆ వీడియోలో ప్రధాని మోదీ మెలోడి చాక్లెట్ ప్యాకెట్‌ను మెలోనికి అందించారు. అయితే ప్రధాని మోదీ చాలా మంచి గిఫ్ట్ తెచ్చారని మెలోని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మెలోడి అని చదువుతూ ప్రధాని మోదీ, మెలోనిలు నవ్వుతూ కనిపించారు. ఇక, గతంలో మోదీ, మెలోనిల మధ్య జరిగిన సమావేశాల సమయంలోనే 'మెలోడి' అనే పదం ప్రాచుర్యం పొందిన సంగతి తెలిసిందే. ఇది 'మెలోని', 'మోడి' పేర్లతో నెటిజన్స్ క్రియేట్ చేసిన పదం. గతంలో ఇరువురు నాయకుల సమావేశం జరిగిన సందర్భాల్లో ఈ పదం ట్రెండింగ్‌లో నిలిచిన సంగతి తెలిసిందే. తాజా మోదీ ఇటలీ పర్యటన సందర్భంగా మరోసారి మెలోడి ట్రెండింగ్‌లో నిలిచింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588